ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కాకినాడ
జిల్లా వార్తలు
ఆదివారం 14 ఏప్రిల్ 2024 | 5

15 నుంచి జూన్ 14 వరకు సముద్రంపై వేట నిషేధం

» 61రోజులపాటు మత్స్యకారుల ఉపాధికి విరామం

- 7లో



సగానికి శఠగోపం

- జిల్లాలో ఆర్టీసీ బస్సులను అడ్డంగా వాడేసుకుని ఆనక డబ్బులు ఎగ్గొట్టేసిన జగన్ సర్కారు
- జిల్లా పర్యటనలు, సిద్ధం సభకు వందల్లో బస్సులు లాగేసుకున్న ప్రభుత్వం
- ఇప్పటివరకు ఆర్టీసీకి రూ.8.50కోట్లు బకాయి పడ్డ వైనం
- తీరా కోడ్‌కు ముందు సగానికి సగం ఎగ్గొట్టేసిన ప్రభుత్వం
- కేవలం రూ.4కోట్లు మాత్రమే చెల్లించి మిగిలిన డబ్బులకు పంగనామాలు
- లబోదిబోమంటున్న అధికారులు: డీజిల్ డబ్బులు కూడా ఇవ్వలేదని ఆవేదన
- అవే బస్సులు ప్రయాణికుల సర్వీసులకు తిప్పితే మంచి రాబడి వచ్చేదంటున్న అధికారులు

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

జగన్ సర్కారు జిల్లా ఆర్టీసీకి శఠగోపం పెట్టింది. పార్టీ అవసరాలకు, సీఎం సభల పేరుతో ఎడాపెడా వందలాది బస్సులను లాక్కుని ఇవ్వాల్సిన డబ్బులకు పంగనామాలు పెట్టింది. రెండేళ్లుగా ఎడాపెడా వివిధ అవసరాలకు బస్సులను వాడేసిన ప్రభుత్వం మొత్తం రూ.8.50కోట్లు బాకీ పడింది. వీటిని అధికారులు ఎప్పుడు అడిగినా లేవనే సమాధానం చెబుతూ వస్తోంది. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల కోడ్‌కు ముందు హడావుడిగా కేవలం రూ.4కోట్లు మాత్రమే బిల్లులు చెల్లించి చేతులు దులిపేసుకుంది. మిగిలిన డబ్బులు ఇవ్వకుండా తప్పించుకుంది. దీంతో ఇప్పుడు ఆర్టీసీ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. రూ.8కోట్లకుపైగా బాకీ పడితే సగం మాత్రమే చెల్లించి మమ అనడంతో ఏం చేయాలో తెలియక అధికారులు జుట్టు పీక్కుంటున్నారు. మిగిలిన డబ్బులు అడుగుదామన్నా కోడ్ రావడంతో నష్టపోయినట్లు గుర్తించి లబోదిబోమంటున్నారు. సగం కోసేసి చెల్లించిన బకాయిల డబ్బుల కనీసం డీజిల్ ఖర్చులకు కూడా రాలేదని వాపోతున్నారు. అవే బస్సులు వైసీపీకి ఇవ్వకుండా ప్రజల అవసరాలకు సర్వీసులు తిప్పితే లాభాలు వచ్చేవని గుర్తు చేసుకుని మథనపడుతున్నారు.

మోసం గురూ..

తన అవసరాలకోసం, ప్రచారం కోసం ఏ వ్యవస్థను అయినా అడ్డగోలుగా వాడేసుకోవడం అధికార వైసీపీకి అలవాటుగా మారింది. గతంలో పార్టీ ప్రచారంకోసం వందల కోట్లు వెచ్చించి ప్రభుత్వ భవనాలకు వైసీపీ రంగులు వేసి జనంతో చీవాట్లు పెట్టించుకుంది. చివరకు పట్టాదారు పాసుపుస్తకాలు, భూముల సర్వే రాళ్లపైనా జగన్ ఫొటోలు పెట్టుకుని అభాసుపాలైంది. చివరకు ఆర్టీసీని సైతం వైసీపీ వదల్లేదు. అసలే లాభాలు లేక, సర్వీసులు పెంచలేక నానా యాతన పడుతున్న ఆర్టీసీని జగన్ ప్రభుత్వం గత రెండేళ్లలో అడ్డంగా పిండేసింది. పార్టీ ప్రచారం కోసం, సీఎం జగన్ సభలు, సిద్ధం సభల కోసం ఆర్టీసీ మెడపై కత్తిపెట్టి వందల బస్సులను తరలించేసింది. వీటికి ఏమాత్రం డబ్బులు ఇవ్వకుండా ఆర్టీసీతోనే డీజిల్ ఖర్చు చేయించి సర్వీసులన్నీ తన అవసరాలకు వాడుకుంది. ఇలా ఈ రెండేళ్లలో అనేక సభలు, సమావేశాలకు వందలాది బస్సులు తీసేసుకుంది. ఇలా ఇప్పటివరకు రూ.8.50కోట్లు జగన్ ప్రభుత్వం జిల్లా ఆర్టీసీకి బకాయి పడింది. ప్రధానంగా 2022, జూలైలో జగన్ పిఠాపురం నియోజకవర్గం గొల్లప్రోలులో పర్యటించారు. ఇందుకోసం ఆర్టీసీనుంచి వందలాది బస్సులను ప్రభుత్వం తీసుకుంది. ప్రజల అవసరాలను పక్కనపెట్టి సర్వీసులన్నీ మళ్లించేసింది. ఆ తర్వాత గతేడాది పెద్దాపురం, ఈ ఏడాది కాకినాడ సిటీల్లో జగన్ సభలకు జిల్లావ్యాప్తంగా పలు డిపోలకు చెందిన వందలాది బస్సులను ప్రభుత్వం లాగేసుకుంది. వీటన్నింటికీ కలిపి రూ.2కోట్లకుపైగా ప్రభుత్వం బాకీ పడింది. అసలే సర్వీసులు నిలిపివేసి సీఎం సభలకు బస్సులు పంపడంతో ఆర్టీసీ రాబడికి గండిపడింది. ఈ బస్సులను జనం కోసం తిప్పితే ఆరోజుకు లక్షల్లో రాబడి వచ్చేది. కానీ ప్రభుత్వ అవసరాల పేరుతో బస్సులు పంపడంతో నిధులు విడుదల కాలేదు. దీంతో ఎలాగైనా బస్సులు పంపినందుకు బిల్లు ఇవ్వాలని రెండు నెలల కిందట జిల్లా ఆర్టీసీ ఉన్నతాధికారులు ప్రభుత్వానికి లేఖ రాశారు. అయినా సర్కారునుంచి ఉలుకు పలుకూ లేదు. విశాఖలో జనవరి నెలాఖరున వైసీపీ సిద్ధం సభ ఏర్పాటు చేసింది. ఇది పూర్తిగా పార్టీ కార్యక్రమం. దీనికి కూడా జిల్లా నుంచి వందలాది బస్సులు లాగేసుకున్నారు. ఆ తర్వాత ఫిబ్రవరిలో ఏలూరులో జరిగిన సిద్ధం సభకు కూడా జిల్లా నుంచి బస్సులు తీసుకున్నారు. కానీ వీటికి కూడా డబ్బులు ఇవ్వలేదు. కోనసీమ జిల్లా తూర్పుగోదావరి జిల్లాల్లో జరిగిన సీఎం సభలకు కూడా బస్సులు తీసుకున్నారు. వీటన్నింటికీ డీజిల్ కొట్టించి ఆర్టీసీయే పంపింది. ఈ నేపథ్యంలో మొత్తం సీఎం ప్రచార కార్యక్రమాలకు జిల్లా ఆర్టీసీ నుంచి తీసుకున్న బస్సుల అద్దె రూ.8.50కోట్లు అయింది. రెండేళ్లు దాటిపోయినా ఇందులో ఒక్కరూపాయి కూడా ప్రభుత్వం ఇవ్వలేదు.

సిద్ధం సభలకు తిప్పినవీ చెల్లించలేదు

అటు పార్టీ ప్రచారంకోసం నిర్వహించిన సిద్ధం సభల కోసం ఆర్టీసీని వాడుకున్నా అవీ చెల్లించలేదు. అదే సమయంలో ప్రతిపక్ష టీడీపీ చంద్రబాబు సభలకోసం, లోకేశ్ యువగళం ముగింపు సభకోసం డబ్బులు చెల్లిస్తామని, బస్సులు పంపాలని టీడీపీ ఆర్టీసీకి లేఖ రాసినా కనీసం పట్టించుకోలేదు. కానీ జగన్ సర్కారు మాత్రం ఆర్టీసీని అడ్డదిడ్డంగా వాడేసుకుని డబ్బులు కూడా ఇవ్వలేదు. ఇటీవల ఎన్నికల కోడ్ వస్తుందనగా, ఆగమేఘాలపై జిల్లా ఆర్టీసీకి బకాయిపడ్డ రూ.8.50కోట్లలోగానికి సగం కోసేసి రూ.4కోట్లు మాత్రం చెల్లించి జగన్ సర్కారు మమ అనిపించేసింది. దీంతో ఆర్టీసీ అధికారులు షాక్ తిన్నారు. ఖర్చు రూ.8.50కోట్లు అయితే రూ.4కోట్లు చెల్లించడమేంటని తెల్లముఖం వేశారు. ఈలోపు కోడ్ రావడంతో ఆ డబ్బులు రావని తెలిసి తలపట్టుకుంటున్నారు. ఇక మిగిలిన డబ్బులు రావని అర్థమైపోయి ఏంచేయాలో తెలియక గింజుకుంటున్నారు. రేపు ఎన్నికలు జరిగి ఒకవేళ ప్రభుత్వం మారితే ఆ డబ్బులు పోయినట్లేనని అంచనా వేసుకుని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి బాకీ పడ్డ మొత్తంలో చెల్లించిన డబ్బులు డీజిల్ ఖర్చులకు రాలేదని అధికారులు చెబుతున్నారు. అదే సీఎం సభలకు బస్సులను పంపించకుండా జనం కోసం సర్వీసులను తిప్పితే లాభం వచ్చేదని తల్చుకుని ఆవేదన వ్యక్తం చేశారు. సగానికిపైగా శఠంగోపం పెట్టిన వైసీపీ తీరును తల్చుకుని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పైసాపైసా లెక్కేసే ఆర్టీసీలో ఇలా కోట్ల డబ్బులను జగన్ సర్కారు ఎగ్గొట్టడంపై సంఘాలు మండిపడుతున్నాయి.



పాదగయలో భక్తులపై.. బాదుడు

- పూజలు, సేవలు, అభిషేకాలు సామాన్యులకు గగనమే
- రుసుములు ఏకంగా 100నుంచి 300శాతం పెంపు
- అభ్యంతరాలు ఉంటే తెలపాలని నోటీసులు
- ఎన్నికల వేళ సీఈవో ఏకపక్ష నిర్ణయం
- మండిపడుతున్న భక్తులు, హిందూ సంఘాలు
- ఇప్పటికే ఈవో వైఖరిపై విమర్శలు, ఆరోపణలు

పిఠాపురం, ఏప్రిల్ 13: దక్షిణకాశీగా విరాజిల్లుతున్న పాదగయ క్షేత్రంలో భక్తులపై బాదుడుకు రంగం సిద్ధమైంది. ఇక ఇక్కడ పూజలు, సేవలు, అభిషేకాలు, పిండ ప్రధానాలు సామాన్యులకు గగనమే. రుసుములను ఒకేసారి 100నుంచి 300శాతంపైగా పెంచాలని ఈవో తీసుకున్న ఏకపక్ష నిర్ణయంపై భక్తులు, హిందూ, బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు మండిపడుతున్నారు, ఎన్నికల వేళ గుట్టుగా ఎవరికీ తెలియకుండా రుసుములు పెంచడం భక్తుల మనోభావాలను దెబ్బతీయడమేనని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పిఠాపురం పట్టణంలోని పాదగయ క్షేత్రంలో స్వయంభూ కుక్కుటేశ్వరస్వామి, స్వయంభూ దత్తాత్రేయస్వామి, రాజరాజేశ్వరీదేవి, అష్టాదశశక్తి పీఠాల్లో దశమ శక్తి పీఠం అధిష్ఠాన దేవతైన పురుహూతికాఅమ్మవార్లను దర్శించుకునేందుకు నిత్యం ఉభయ తెలుగురాష్ట్రాల భక్తులతోపాటు దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు తరలివస్తూ ఉంటారు. ఇక్కడ పితృదేవతలకు పిండ ప్రధానాలతోపాటు స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు, కుంకుమ పూజలు, హోమాలు, అభిషేకాలు సహా వివిధ ప్రత్యేక పూజల్లో పాల్గొనేందుకు ఆసక్తి చూపుతుంటారు. వీటికి గతంనుంచి ఉన్న రుసుములను ఇప్పుడు ఒకేసారి 100శాతం నుంచి 300శాతం పెంచాలని ఈవో తీసుకున్న నిర్ణయం వివాదాస్పదంగా మారింది. ఇప్పటికే మహాశివరాత్రి పర్వదినాల సమయంలో భక్తులకు సౌకర్యాలు కల్పించడంలో విఫలం కావడంతోపాటు దర్శనాలు, ఇతర పూజలు విషయంలో ఆయన తీరు విమర్శలకు గురైంది.

రుసుములు ఇలా పెంచారు

పాదగయలో పితృదేవతలకు పిండప్రదానాలు చేసేందుకు దేశంలో వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు అధికసంఖ్యలో తరలివస్తూ ఉంటారు. ప్రస్తుతం పిండప్రదానానికి రుసుము రూ.100ఉండగా దాన్ని రూ.300కు పెంచాలని నిర్ణయించారు. సూర్యనమస్కారాలకు ఇప్పటివరకూ రుసుం లేకపోగా కొత్తగా రూ.150 వసూలు చేయాలని ప్రతిపాదించారు. ప్రత్యేక దర్శనం కొత్తగా ఏర్పాటు చేసి రూ.20 వసూలు చేయాలని, ఇప్పటివరకూ అంతరాలయ దర్శనానికి రూ.20గా ఉన్న రుసుములు రూ.50కు పెంచాలని, మాలధారణ, ఇరుముడికి రూ.20నుంచి రూ.50కి, సహస్రనామార్చన, వాహనపూజకు రూ.50నుంచి రూ.100కు, మహన్యాసపూర్వ అభిషేకం, తైలాభిషేకం రుసుం రూ.70 నుంచి రూ.150కి, గోపూజ రూ.100 నుంచి రూ.150, హోమం రూ.150నుంచి రూ.300, జపం, పారాయణ, నామకరణ, అన్నప్రాసనకు రూ.200నుంచి రూ.300కు పెంచాలని నిర్ణయించగా ఏకాదశ రుద్రాభిషేకానికి ఏకంగా రూ.150 నుంచి రూ.500కు పెంచాలని నిర్ణయించారు. నారాయణ బలిప్రదానానికి రూ.250 నుంచి రూ.600కు, వీడియో షూటింగ్‌కు రూ.558 నుంచి రూ.1000కు, లక్షపత్రిపూజ, కుంకుమార్చనలకు రూ.500నుంచి రూ.1500కు, ఉపనయనం రూ.1116 నుంచి రూ.1500కు పెంచారు.

దత్తజయంతి సమయంలో దత్తాత్రేయస్వామి ప్రత్యేక దర్శనానికి కొత్తగా రుసుము రూ.20గా నిర్ణయించారు. మహాశివరాత్రి, దేవీనవరరాత్రులు, కార్తీక మాస సమయంలో ప్రత్యేక దర్శన రుసుమును రూ.20 నుంచి రూ.50లకు, అంతరాలయ దర్శన రుసుమును రూ.40నుంచి 100లకు. చండీహోమం రూ.200నుంచి రూ.400కు, పౌర్ణమి కల్యాణం రూ.558 నుంచి రూ.1000కు పెంచడంతోపాటు కార్తీక మాసంలో లక్షపత్రిపూజకు కొత్తగా రూ.2వేల రుసుము నిర్ణయించారు.

శాశ్వత అన్నదానం కనీస మొత్తం భారీగా పెంపు

పాదగయలో నిత్యాన్నదాన పథకానికి సమృద్ధిగా నిధులు ఉన్నాయి. భక్తులనుంచి భారీగా విరాళాలు వస్తున్నాయి. కొంతకాలంగా ఇక్కడ భక్తులకు వడ్డించే ఆహార పదార్థాల నాణ్యతపై విమర్శలున్నాయి. నాణ్యతను మెరుగుపరచడంపై దృష్టి పెట్టకుండా శాశ్వత అన్నదానానికి ఇచ్చే కనీస మొత్తాన్ని ఏకంగా మూడున్నర రెట్లు పెంచారు. ఇప్పటివరకూ శాశ్వత అన్నదానం నిమిత్తం అంటే భక్తులు కోరుకున్న ఒక రోజున పదేళ్లపాటు వారు కోరిన పేరుపై అన్నదానం చేసే కనీస మొత్తం ఇప్పటివరకూ రూ.1500 ఉండగా దాన్ని రూ.5వేలకు పెంచారు. శాశ్వత పిండప్రదానాల మొత్తాన్ని రూ.6వేల నుంచి రూ.10వేలకు, అన్ని రకాల పరోక్ష సేవలను 100శాతం, వసతి సముదాయాల్లో గదుల అద్దెలను ఒకేసారి 50శాతం పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు.

ఎందుకీ రహస్యం?

పాదగయలో అన్నిరకాల రుసుములను పెంచుతూ నిర్ణయం తీసుకుని ఆ మేరకు భక్తులు, వివిధవర్గాల ప్రజలు నుంచి అభ్యంతరాలు స్వీకరించేందుకు నిర్ణయించారు. ఈ ఉత్తర్వులను ఆలయ ఈవో, సహాయ కమిషనరు పులి నారాయణ మూర్తి ఈనెల 9న జారీచేశారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఈ నోటీసులను అందుబాటులో ఉంచామని అందులో తెలిపినా శనివారం వరకూ ఈ ఉత్తర్వులు వెలుగుచూడలేదు. కనీసం పత్రికలకు సమాచారం ఇవ్వకుండా రహస్యంగా ఉంచారు. అసలు ఎందుకు రహస్యంగా ఉంచాలని భావించారు అనే అంశం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే ఈవో వైఖరిపై పలు విమర్శలు, ఆరోపణలు ఉండగా రుసుములు పెంపు నిర్ణయంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది.

ఎన్నికల వేళ

ఎన్నికల షెడ్యూల్ ప్రకటించడంతో అందరూ ఆ హడావుడిలో ఉంటారని భావించి పూజా రుసుములను పెంచాలని నిర్ణయం తీసుకోవడం వివాదాస్పదంగా మారింది. ఆలయానికి ధర్మకర్తల మండలి లేని సమయంలో, ఆది ఈవో పదవీ విరమణకు దగ్గరగా ఉన్న వేళ ఈ నిర్ణయాన్ని తీసుకోవడాన్ని పలువురు తప్పుపడుతున్నారు. రుసుములు పెంచాలని నిర్ణయించి ఇప్పుడు భక్తులు, అర్చకులు, పురోహితుల అభిప్రాయాలు కోరడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. పాదగయలో పూజా రుసుములు, వసతిగృహాల అద్దెల రేట్లు పెంపునకు సంబంధించి అభ్యంతరాలుంటే ఈ నెల 23 లోగా తెలియజేయాలని ఆలయ ఈవో సూచించారు.

పెంపునకు వ్యతిరేకంగా అఖిలపక్ష సమావేశం

పాదగయక్షేత్రంలో అన్ని రకాల పూజారుసుములు, ఇతర రేట్లు ఏకపక్షంగా భారీగా పెంచడాన్ని వ్యతిరేకిస్తూ ఆలయం వద్ద సోమవారం ఉదయం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసినట్లు బ్రాహ్మణసేవాపరిషత్ అధ్యక్షుడు యనమండ్ర సూర్యనారాయణ తెలిపారు. పెంపు నిర్ణయం తీసుకునేవరకూ ఆందోళన చేపడతామని స్పష్టం చేశారు. హిందువులను ఆలయాలకు దూరం చేసే కుట్రలో భాగంగానే అన్ని రకాల రుసుములు పెంచుతున్నారని, తక్షణం నిర్ణయం ఉపసంహరించుకోవాలని విశ్వహిందూపరిషత్, భజరంగదళ్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు.

ఓటమి భయంలో వైసీపీ క్యాడర్

- ఉత్సాహం నింపేందుకు మిథున్‌రెడ్డి పర్యటన
- కాకినాడ రాయల్‌పార్క్‌లో రహస్య సమావేశం

కలెక్టరేట్(కాకినాడ), ఏప్రిల్ 13: జిల్లాలో వైసీపీ క్యాడర్ ఓటమి భయంతో ఉన్నట్లు కనిపిస్తోంది. ఎమ్మెల్యే అభ్యర్థులు, ఎంపీ అభ్యర్థి ప్రచారానికి ఎక్కడికి వెళ్లినా నిరసన సెగలు ఎదురవుతున్నాయి. దీంతో క్యాడర్‌లో ఉత్సాహం నింపేందుకు వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డి జిల్లాలో పర్యటించారు. తొలుత కాకినాడ రాయల్‌పార్క్ హోటల్‌లో శనివారం ఉదయం పార్టీ అభ్యర్థులతో రహస్యంగా సమావేశమయ్యారు. కాకినాడ జిల్లా లో ఉన్న ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పోటీలో ఉన్న అభ్యర్థులు సమావేశంలో పాల్గొన్నట్లు సమాచారం. జిల్లాలో టీడీపీ కూటమి బలంగా ఉన్న నేపథ్యంలో ప్రచారం ముమ్మరం చేయాలని ఆదేశించినట్లు సమాచారం. పైగా జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ పిఠాపురం నుంచి అసెంబ్లీ బరిలో దిగ డంతో మరింత జాగ్రత్తగా ఉండాలని అభ్యర్థులకు సూచిం చినట్లు సమాచారం. పార్టీలో అంతర్గత విభేదాలు లేకుండా కార్యకర్తలను కలుపుకోవాలని మిథున్‌రెడ్డి సూచించారు. వైసీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజ ల్లోకి తీసుకెళ్లాలని దిశానిర్దేశం చేశారు. త్వరలో జిల్లాలో జరిగే సీఎం పర్యటన విజయవంతం చేయాలని కోరారు. పోటీలో ఉన్న అభ్యర్థులు ఇంటింటికీ తిరిగి ప్రచారం చేయాలని ఆదేశించారు. గంటన్నరపాటు జరిగిన సమావేశంలో ప్రచార సమయంలో ఎదుర్కొంటున్న సవాళ్లను అధిష్ఠానం దృష్టికి అభ్యర్థులు తీసుకెళ్లారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు సహకరించాలి: ఎస్పీ



స్థానికులతో మాట్లాడుతున్న ఎస్పీ సతీష్‌కుమార్

కాకినాడ క్రైం, ఏప్రిల్ 13: రానున్న సార్వత్రిక ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో జరిపేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని ఎస్పీ సుబ్రమణి సతీష్‌కుమార్ కోరారు. కాకినాడ, పోర్టు పోలీస్‌స్టేషన్ పరిధిలోని సమస్యాత్మక ప్రాంతాలైన ఏటిమొగ తదితర ప్రాంతాల్లో శనివారం రాత్రి ఎస్పీ ప్రత్యేక పోలీస్ బలగాలతో కలిసి కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్లు ఎవరూ ఎటువంటి ప్రలోభాలకు గురికాకుండా, ఏ రాజకీయ పార్టీలకు భయపడకుండా తమ ఓటు హక్కును ప్రశాంత వాతావరణంలో వినియోగించుకోవాలన్నారు. ఏటిమొగలోని ముల్లారమ్మ గుడివీధి, ఎర్రరోడ్డు, బ్రహ్మంగారి గుడి వీధి, ఎన్‌టీఆర్ విగ్రహ కూడలి, బాగిత్తమ్మ గుడివీధి, తూర్పువీధి, నంధిగుడి తదితర ప్రాంతాల్లో ఎస్పీ పర్యటించి స్థానిక ప్రజలకు అవగాహన సదస్సును నిర్వహించారు. కాకినాడ ఎస్‌డీపీవో ఎ.హనుమంతరావ్, పోర్టు సీఐ సుమంత్ పాల్గొన్నారు.

నాన్ లేఅవుట్లు వేస్తే చర్యలు తప్పవు

- కాకినాడ ఆర్డీవో కిషోర్
- ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన

సర్పవరం జంక్షన్, ఏప్రిల్ 13: ప్రభుత్వ నిబంధనల మేరకు ఫీజు చెల్లించిన తర్వాత అనుమతి పొందిన వ్యవసాయ పొలాలను భూమార్పిడి చేసుకోవచ్చని, ఇందుకు విరుద్ధంగా నాన్ లేఅవుట్లు వేస్తే నిర్వాహకులపై చర్యలు తప్పవని కాకినాడ ఆర్డీవో ఇట్ల కిషోర్ హెచ్చరించారు. కాకినాడ రూరల్ మండలం తిమ్మాపురం అవంతినగర్‌లో అనుమతుల్లేకుండా నాన్ లేఅవుట్‌తో ప్రభుత్వ ఆదాయానికి గండి అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురించిన కథనానికి ఆర్డీవో స్పందించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాన్ లేఅవుట్‌కి చెందిన రికార్డులు తీసుకురావాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వానికి ఫీజు చెల్లించకుండా, ఎందుకు భూమార్పిడి చేశారు, ఏ మేర నిబంధనలు ఉల్లంఘించారో తదితర వివరాలతో ప్రభుత్వ ఆదాయానికి ఏమేర నష్టం వాటిల్లిందో తదితర వివరాలను తన వద్దకు తీసుకురావాలని ఆదేశించారు. నాన్ లేఅవుట్లను ప్రోత్సహిస్తే పంచాయతీ, రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకునేందుకు ఏమాత్రం ఉపేక్షించేదిలేదని తెలిపారు.

ఎన్నికల ప్రక్రియపై పూర్తి అవగాహన కల్గి ఉండాలి: కలెక్టర్



శిక్షణ కార్యక్రమాలను పరిశీలిస్తున్న కలెక్టర్ నివాస్

కలెక్టరేట్(కాకినాడ), ఏప్రిల్ 13: సార్వత్రిక ఎన్నికల మార్గదర్శకాలపై అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ జె.నివాస్ ఆదేశించారు. జిల్లాలో తుని, ప్రత్తిపాడు, పెద్దాపురం నియోజకవర్గాల్లో జరుగుతున్న పోలింగ్ సిబ్బంది శిక్షణా కార్యక్రమాలను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ ప్రక్రియకు ముందు నిర్వహించే మాక్ పోల్ అత్యంత కీలకమన్నారు. ఈవీఎం, వీవీప్యాట్ల పనితీరు, పీవో డైరీ, ఇతర డాక్యుమెంట్లు పూర్తి చేయడంపై ఎలాంటి తప్పులకు తావులేకుండా అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. పోలింగ్ కార్యక్రమానికి ముందు డిస్ట్రిబ్యూషన్ సెంటర్లవద్ద పోలింగ్ సిబ్బంది ఎలాంటి ఇబ్బందులు పడకుండా చూడాలన్నారు. ఎన్నికల కమిషన్ ఇచ్చిన హేండ్‌బుక్‌ను పోలింగ్ సిబ్బంది తప్పనిసరిగా చదవాలన్నారు. పీవో డైరీ దగ్గరనుంచి వివిధ డాక్యుమెంట్లు పూర్తి చేయడంలో పీవోలు ఎలాంటి పొరపాట్లు చేయకుండా అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో తుని ఆర్వో రామలక్ష్మి, ప్రత్తిపాడు ఆర్వో శ్రీనివాసరావు, పెద్దాపురం ఆర్వో సీతారామారావు పాల్గొన్నారు.

మద్యం కొరత

- ఎన్నికల కోడ్ అమలుతో ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పరిమిత సంఖ్యలోనే మద్యం సీసాల అమ్మకాలు
- మధ్యాహ్నానికే అయిపోతున్న మద్యం
- సారా వైపు మొగ్గుచూపుతున్న మందుబాబులు

జగ్గంపేట, ఏప్రిల్ 13: మద్యం షాపుల్లో మద్యం కొరతతో చాలామంది మందుబాబలు సారా వైపే మొగ్గ చూపుతున్నట్లు సమాచారం. ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో ప్రభుత్వ మద్యం దుకాణాల్లో రోజుకు పరిమిత సంఖ్యలో మాత్రమే సీసాలు అమ్మాలని ఆంక్షలు విధించారు. ఇలా జాతీయ రహదారిని ఆనుకుని నియోజకవర్గ ప్రధాన కేంద్రమైన జగ్గంపేటలో అధికంగా అమ్మకాలు ఉన్నాయి. ఇక్కడ 800మాత్రమే పరిమితి ఉండడంతో త్వరితగతిన ఎన్నికల వారు ఇచ్చిన టార్గెట్ అయిపోవడంతో మందు లేక మందుబాబులు విలవిలలాడుతున్నారు. దీంతో వీరు వేరే దారి లేక లోపలగా సారా అమ్మకందారులను ఆశ్రయించి అధికమొత్తంలో సొమ్ములు చెల్లించుకుని సారాను తాగుతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి.

నిజంగా కొరతేనా?

మెట్టప్రాంతమైన జగ్గంపేట పరిసర ప్రాంత గ్రామాలన్నింటిలోను ఇదే పరిస్థితి నెలకొంది. జగ్గంపేట మొత్తంగా మూడు షాపులు ఉండగా 2400 మద్యం సీసాలు సరిపోవడంలేదు. దీంతో నిజంగానే ఈ పరిస్థితి వస్తోందా లేక ముందుగానే ఇక్కడ అమ్మకం చేసే కాంట్రాక్టు సిబ్బంది ఈ మందును అమ్మేవారికి కేటాయించుకుని బయటికి తరలించి అమ్మకాలు జరుపుకుని సొమ్ములు చేసుకుంటున్నారా అని కొందరు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల కోడ్ అమలుతో మద్యం దొరక్క అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని మందుబాబులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక చేసేది లేక సారా అమ్మకందారులను ఆశ్రయించి అధిక మొత్తంలో కొనుగోలు చేసుకుని సారాలతో సరిపెట్టుకునే పరిస్థితి మెట్ట ప్రాంతంలో నెలకొంది. జగ్గంపేట పట్టణంలో కాకుండా గండేపల్లి, కిర్లంపూడి మండలాల్లో కూడా ఇదే పరిస్థితి ఉందని తెలియవచ్చింది. ఇదే పరిస్థితి కొనసాగితే సారాకి గిరాకీ ఏర్పడి దాని తయారీ, అమ్మకాలు పెరిగిపోతాయని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. డిమాండ్ ఎక్కువ ఉండడంతో అడ్డగోలుగా తయారు చేసి సారా అమ్మకాలు పెరిగితే మద్యం బాబులు అనారోగ్యాల పాలవుతారని ఆయా కుటుంబసభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వైసీపీకి.. మూడింది!



కాఫర్ డ్యామ్

- రంప ఎన్నికల్లో ప్రధానాంశాలుగా పోలవరం, జీవో నెం.3, అల్లూరి జిల్లా
- అధికార పక్షానికి ఎక్కడికక్కడ నిరసన సెగలు
- చంద్రబాబు హామీతో కూటమి నేతలకు నీరాజనాలు

(రంపచోడవరం)

రంపచోడవరం రిజర్వుడు అసెంబ్లీ స్థానానికి జరిగే సాధారణ ఎన్నికల్లో ప్రధాన పార్టీలకు పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులు, స్థానిక గిరిజనులకు నూరుశాతం రిజర్వేషన్ కల్పించిన జీవో నెం.3 రద్దు అంశాలు కీలకంగానూ ప్రతిపక్ష పార్టీలకు అస్త్రాలుగానూ మారుతున్నాయి. ఇక జిల్లాల పునర్విభజనలో భాగంగా ఏర్పాటైన అల్లూరిజిల్లా కూడా ఓటర్లను ప్రభావితం చేసే ప్రధాన సమస్యగా మారింది. పోలవరం జాతీయ ప్రాజెక్టు నిర్మాణంతో ముంపునకు గురయ్యే 371 ఆవాసాల్లో 234 ఆవాసాలు రంపచోడవరం నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాల్లో ఉన్నాయి. రంపచోడవరం డివిజన్‌లో దేవీపట్నం మండలం, చింతూరు డివిజన్లోని విలీన మండలాలు చింతూరు, వి.ఆర్.పురం, కూనవరం, ఎటపాక మండలాలు ఉన్నాయి. ఈ 234 ఆవాసాల్లో సుమారు లక్షమంది జనాభా ఉన్నారు. కాఫర్‌డ్యామ్ నిర్మాణంతో ఇందులో ఒక్క దేవీపట్నం మండలంలోని 38 ఆవాసాల్లో ఒక్క తాళ్లూరు మినహా అన్ని ఆవాసాలనూ ఖాళీ చేయించేశారు. విలీన మండలాల్లోని సుమారు 194 ఆవాసాలకు సంబంధించి ఎక్కడా పునరావాస ప్రగతి లేదు. తరలించిన 37 ఆవాసాల నిర్వాసితులకు ఎక్కడా పూర్తిస్థాయి పునరావాసాన్ని కల్పించలేదు.

జీవో నెం.3 ఈ ఎన్నికల్లో కీలకం

ఇక గిరిజన ప్రాంతాలలో స్థానిక గిరిజనులకే నూరు శాతం ఉపాధ్యాయ పోస్టులను కల్పించే తెలుగుదేశం ప్రభుత్వం తెచ్చిన జీవోనెం. 3 కూడా ఈ ఎన్నికల్లో కీలకంగా మారింది. సుప్రీం కోర్టు ఈ జీవోను కొట్టివేయడంతో జనాభా ప్రాతిపదికన మాత్రమే ఉద్యోగాలు స్థానిక గిరిజనులకు దక్కుతాయి. దీంతో గిరిజన వర్గాలు ఆందోళన చెందుతున్నాయి. ఈ విషయంలో ఇప్పటికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సుప్రీంకోర్టులో రివ్యూ పిటీషన్లు దాఖలు చేయగా మరో 15 రివ్యూ పిటిషన్లు కూడా దాఖలయ్యాయి. ఈ నెలలోనే ఈ కేసుల విచారణ కూడా సుప్రీంలో జరిగింది. ఈ కేసుల మాట ఎటుంచినా అరకు సభలో తెలుగుదేశం అధినేత చంద్రబాబు ఈ జీవో నెం.3పై స్పందించి తమ ప్రభుత్వం వచ్చిన వెంటనే స్థానిక గిరిజనులకు గిరిజన ప్రాంత ఉద్యోగాల్లో నూరుశాతం రిజర్వేషను దక్కే చర్యలను తీసుకుంటామని హామీ ఇచ్చారు. వైసీపీ నేతలు, ప్రభుత్వం మాత్రం ఇంతవరకూ ఈ అంశంపై స్పందించకపోవడం శోచనీయం.

ఈ పోలవరం నిర్వాతుల అంశం, జీవో నెం.3 వ్యవహారం అధికార పార్టీ నేతలను ఇరుకున పెట్టే అంశంగా మారింది. ఎక్కడికక్కడ ఆయా నేతలకు నిరసన సెగలు తగులుతూనే ఉన్నాయి. ఇక అల్లూరి జిల్లా ఏర్పాటు అంశం కూడా ఈ నియోజకవర్గ ప్రజానీకాన్ని ఇబ్బంది పెడుతోంది. ఈ సమస్యను తీర్చే విధంగా రంపచోడవరం, పోలవరం గిరిజన నియోజకవర్గాలను కలుపుతూ పోలవరం గిరిజన జిల్లా ఏర్పాటుపై ఇప్పటికే దేశం అధినేత హామీ ఇచ్చారు. చంద్రబాబు హామీతో ఇక్కడ కూటమి అభ్యర్థులకు నీరాజనాలు పడుతున్నారు. మొత్తంగా పోలవరం నిర్వాసితులు, జీవో నెం.3 అల్లూరి జిల్లా అంశాలు ఈ ఎన్నికల్లో ప్రభావాన్ని చూపబోతున్నాయి.

పోలవరం గిరిజన జిల్లా ఏర్పాటుపై దేశం అధినేత హామీ

కొన్ని ఆవాసాల నిర్వాసితులకు పునరావాస కాలనీలను కూడా పూర్తి చేయలేదు. ఈ అంశం ప్రధాన పార్టీల రెండింటి మధ్య నలుగుతున్న అంశం. ఈ అంశాన్నే వామపక్ష-కాంగ్రెస్ కూటమి కూడా అనుకూలంగా మార్చుకోవాలని చూస్తోంది.



అనివేటి మండపానికి చేరిన నూతన ధ్వజస్తంభం

సత్యదేవుడి చెంతకు చేరిన నూతన ధ్వజస్తంభం

18 నుంచి పూజలు, 22న ప్రతిష్ఠా కార్యక్రమం

అన్నవరం, ఏప్రిల్ 13: రత్నగిరివాసుడైన సత్యదేవుడి సన్నిధికి త్వరలో ప్రతిష్ఠించనున్న నూతన ధ్వజస్తంభం శనివారం ఇంజనీరింగ్ అధికారులు అనివేటి మండపంనకు ప్రత్యేక క్రేన్ ద్వారా తీసుకుని వచ్చారు. 56 అడుగులు ఉన్న నారవేప కర్రను ధ్వజస్తంభ ప్రతిష్ఠకు వినియోగిస్తున్నారు. ఈవో రామచంద్రమోహన్ దగ్గరుండి పర్యవేక్షణ చేస్తున్నారు. ఈనెల 18 నుంచి పూజా కార్యక్రమాలను ప్రారంభించి 22న ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన చేయనున్నారు. అనంతరం ధ్వజస్థంభంకు రాగిరేకు అమర్చి బంగారుపూతను వేయనున్నారు. సుమారు రూ.4కోట్లు వ్యయం కానున్నట్లు అంచనా వేస్తున్నారు. దీనికయ్యే వ్యయమంతా నెల్లూరుకు చెందిన దాత కుటుంబసభ్యులు విరాళంగా అందజేస్తున్నారు. ఈ పనులను డీఈలు ఉదయ్‌కుమార్, బి.ఎస్.రాంబాబుల సూచనలతో సిబ్బంది వేగవంతం చేస్తున్నారు. 22వ తేదీన జాతీయ రహదారిపై నిర్మిస్తున్న నమూనాలయంలో విగ్రహాలు ప్రతిష్ఠించే పనులను అధికారులు శరవేగంగా చేపడుతున్నారు. దేవదాయ కమిషనర్ సత్యనారాయణ చేతులమీదుగా ఈ కార్యక్రమాలు నిర్వహిస్తారు.

ట్రైన్‌లో ఆడ బిడ్డకు జన్మనిచ్చిన తల్లి



తల్లీబిడ్డలను 108లో ఎక్కిస్తున్న రైల్వే పోలీసులు

తునిరూరల్, ఏప్రిల్ 13: గౌహతి ఎక్స్‌ప్రెస్ బెంగుళూరు నుంచి కృష్ణాగంజ్ వెళుతున్న రైలులో బెంగుళూరుకు చెందిన హీనా పురిటినొప్పులతో ఆడ బిడ్డకు జన్మనిచ్చింది. ఆ సమయంలో రైలు తుని వద్దకు చేరుకోవడంతో ప్రయాణికుల సహాయంతో రైల్వే పోలీసులకు, 108 సిబ్బందికి సమాచారం అందించగా తల్లీ బిడ్డలను 108లోఎక్కించి ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.

రేపటి నుంచి జూన్ 14 వరకు

సముద్రంపై వేట నిషేధం

61 రోజుల పాటు మత్స్యకారుల ఉపాధికి విరామం



ఉప్పాడ తీరంలో లంగర్‌వేసి భద్రపరుచుకొన్న బోట్లు

ఉప్పాడ(కొత్తపల్లి), ఏప్రిల్ 13: సముద్రంలో మత్స్యసంపద పునరుత్పత్తి చెందేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి సంవత్సరం ఈనెల 15 నుంచి జూన్ 14వరకు వేట నిషేధం అమలు చేస్తోంది. దీనిలో భాగంగా సుమారు 61రోజులపాటు తీర ప్రాంతాలకు చెందిన మత్స్యకారులు సముద్రంలో వేట చేసేందుకు వీలులేదు. కొత్తపల్లి, తొండంగి మండలాలకు చెందిన సుమారు 1400 బోట్లపై వేట చేసే మత్స్యకారులకు సుమారు 8,400 మంది మత్స్యకారులకు రెండునెలల పాటు జీవనోపాధికి ఆటంకం కలుగనుంది. ప్రతీ సంవత్సరం వేట నిషేధం అమలు చేయడం వలన పెద్దజాతి చేపలైన వంజరం, కోనాము, మాగ, మునివాలం, సంధువా, సుదుములు, సొర్ర, రొయ్య, నెత్తళ్లు వంటి చేపలు గుడ్లు పెట్టి పొదిగి మత్స్యసంపద అభివృద్ధి చెందు తుందని మత్స్యశాఖ అధికారులు చెబుతున్నారు.

వేట పరిహారం వెంటనే చెల్లించాలి

వేట నిషేధ కాలంలో ప్రభుత్వం మత్స్యకారులకు చెల్లించే పరిహారం వెంటనే చెల్లించాలని తీరప్రాంత మత్స్యకారులు విజ్ఞప్తి చేశారు. ఇటీవల సరైన పాటు లేకపోవడంతో ఆర్థిక ఇబ్బందులతో కుటుంబ పోషణ కష్టంగా మారిందని మత్స్యకారులు వాపోతు న్నారు. వేట నిషేధ పరిహారం సకాలంలో చెల్లించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

భక్తులతో కిక్కిరిసిన శృంగార వల్లభస్వామి ఆలయం



ప్రత్యేక అలంకరణలో శృంగారవల్లభస్వామి

పెద్దాపురం, ఏప్రిల్ 13: కాకినాడజిల్లా పెద్దాపురం మండలంలోని తిరుపతి శృంగారవల్లభస్వామి ఆలయానికి శనివారం భక్తులు అధికసంఖ్యలో పోటెత్తారు. స్వామివారి దర్శనానికి భక్తులు తెల్లవారుజామునే బారులు తీరారు. టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.2,51,580 అన్నదాన విరాళాలు రూ.62,310 ఆదాయం, కేశఖండన ద్వారా రూ.8,240 తులాభారం రూ.450 కానుకద్వారా 216 వెరసి రూ.3,27,796 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు.. సుమారు 8 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించారని తెలిపారు. దేవస్థానం ఛైర్మన్ కర్రి జగదీష్, దేవస్థానం అర్చకుడు పెద్దింటి నారాయణాచార్యులు పాల్గొన్నారు.

19న అచ్చంపేటలో సీఎం జగన్ బస్సు యాత్ర

సర్పవరం జంక్షన్, ఏప్రిల్ 13: కాకినాడరూరల్ మండలం అచ్చంపేట సెంటర్లో ఈనెల 19న సీఎం జగన్ నిర్వహించే మేమంతా సిద్ధం బస్సు యాత్ర విజయవంతానికి సమిష్టిగా కృషి చేయాలని వైసీపీ రీజినల్ కోఆర్డినేటర్ పి.మిథున్‌రెడ్డి కోరారు. శనివారం కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం వైద్యనగర్‌లో రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు ఆధ్వర్యంలో కాకినాడ జిల్లాకు చెందిన 7 నియోజకవర్గాలకు చెందిన ఎమ్మెల్యేలు, అసెంబ్లీ అభ్యర్థులు, ముఖ్య నాయకులతో బస్సుయాత్రపై సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాకినాడ జిల్లాలో కాకినాడరూరల్ తిమ్మాపురం సెంటర్‌లో సిద్ధం సభ ద్వారా సార్వత్రిక ఎన్నికల ప్రచారానికి శంఖారావం పూరిస్తారన్నారు. పార్టీ కేడర్ ఈ బస్సుయాత్రను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని విజయవంతం చేయాలని కోరారు. వందశాతం ఎన్నికల మేనిఫెస్టోను అమలు చేసిన ఘనత సీఎందన్నారు. రాష్ట్రంలో ఉన్న 175 నియోజకవర్గాలో పిఠాపురం ఒకటని, పవన్ కోసం ప్రత్యేకంగా ఎన్నికల ప్రచారం, ప్రణాళికలు అమలు చేయాల్సిన అవసరం తమ పార్టీకి లేదన్నారు. సమావేశంలో ఎంపీ వంగా గీత, ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్, ఎమ్మెల్సీ అనంతబాబు, ఎమ్మెల్యేలు ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, పెండెం దొరబాబు, ఎమ్మెల్యే అభ్యర్థులు దవులూరి దొరబాబు, వరుపుల సుబ్బారావు, తోట నరసింహరావు, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం, ఎస్సీ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పి.అమ్మాజీ, సివిల్ సప్లయిస్ స్టేట్ డైరెక్టర్ జమ్మలమడక నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

సబ్బు బిళ్లపై అంబేడ్కర్ చిత్రం



సోప్ కార్వింగ్ ద్వారా సబ్బు బిళ్లపై చెక్కిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రం ← → ఉపాధ్యాయుడు పిల్లి గోవిందరాజులు



గొల్లప్రోలురూరల్, ఏప్రిల్ 13: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రాన్ని సబ్బు బిళ్లపై చెక్కారు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చెందుర్తి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు పిల్లి గోవిందరాజులు. సోప్ కార్వింగ్ కళ ద్వారా మూడు గంటలపాటు శ్రమించి చెక్కిన అంబేడ్కర్ చిత్రాన్ని గ్రామస్తులు, పాఠశాల విద్యార్థులు తిలకించారు. అంబేడ్కర్ జీవిత చరిత్ర గురించి అవగాహన కల్పించారు. గోవిందరాజులను విద్యాశాఖ ఆర్‌జేడీ గోవిందరాజులు, డీఈవో పి.రమేష్, డీవైఈవో డేనియల్‌రాజు, ఎంఈవోలు వెంకటేశ్వరరావు, శివప్రసాద్, హెచ్‌ఎం సురేష్‌కుమార్ అభినందించారు.

టిప్పర్ లారీ ఢీకొని వ్యక్తి మృతి



ప్రమాదంలో మృతిచెందిన దొరబాబు

శంఖవరం, ఏప్రిల్ 13: కాకినాడ జిల్లా శంఖవరం గ్రామానికి చెందిన కొప్పిశెట్టి దొరబాబు టిప్పర్‌లారీ ఢీకొని మృతి చెందాడు. శంఖవరం నుంచి కత్తిపూడి వైపు వెళుతున్న దొరబాబు(35)ను కత్తిపూడి నుంచి రౌతులపూడి వైపు వెళ్తున్న లారీ ఢీకొనడంతో తీవ్ర గాయాలతో మృతి చెందాడు. స్థానికుల సహాయంతో ఆసుపత్రికి తరలించేందుకు ప్రయత్నించినా తలకు, కాళ్ళకు బలమైన గాయాలు తగలడంతో మార్గంమధ్యలోనే దొరబాబు మృతిచెందాడు. మృతుడికి భార్య కుమారుడు, కుమార్తె ఉన్నారు. ప్రమాదంపై అన్నవరం పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోటీలో ఉన్న అభ్యర్థులు నచ్చకపోతే..

ఓటు దుర్వినియోగం కాకుండా నోటా

అమలాపురం, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు నచ్చకపోతే ఓటు దుర్వినియోగం కాకుండా నోటాకు ఓటు వేసే అవకాశం ఎన్నికల సంఘం కల్పించింది. ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్‌లో పోటీలో ఉన్న అభ్యర్థుల గుర్తులతో పాటు నోటా ఆప్షన్‌ను ఏర్పాటు చేసింది. నోటా బటన్ నొక్కితే ఓటు ఏ పార్టీకి పడదు. కానీ ఓటరు తన ఓటు హక్కును వినియోగించుకున్నట్టుగానే ఎన్నికల సంఘం పరిగణలోకి తీసుకుంటుంది. సాధారణంగా ఎన్నికల సమయంలోనే నోటా అనే పదం ఎక్కువగా వినిపిస్తుంది. గడిచిన సార్వత్రిక ఎన్నికల నుంచి నోటాకు ఆదరణ పెరుగుతూ వస్తోంది. వివిధ రాజకీయ పార్టీలకు సంబంధించిన అభ్యర్థులు నచ్చకపోతే చాలా మంది ఓటు వేయకుండా మిగిలిపోతున్నారు. అలాంటివారు సైతం ఓటు హక్కును వినియోగించుకోవడంతో పాటు తమ నిరసనను తెలియచేసేందుకు నోటా ఎంతో ఉపయోగపడుతుంది. ప్రధానంగా పోలింగ్ శాతాన్ని పెంచడంతో పాటు ఓటర్లు తమ అభిప్రాయాన్ని స్పష్టంగా చెప్పే అవకాశం కల్పించేందుకు నోటాను తీసుకువచ్చారు. బరిలో నిలబడ్డ కొందరు అభ్యర్థులకంటే నోటాకు పడ్డ ఓట్లు ఎక్కువగా ఉంటున్నాయంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

ఇంటి వద్ద నుంచే ఓటింగ్‌కు దరఖాస్తు..

సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన గెజిట్ నోటిఫికేషన్ విడుదలైన తరువాత ఇంటి వద్ద నుంచే ఓటు వేసేందుకు దరఖాస్తు చేసుకోవాలి. ఫారం-12డిని పూర్తిచేసి సంబంధిత రిటర్నింగ్ అధికారికి సమర్పించాలి. 85ఏళ్ల పైబడినవారు, 40 శాతం దివ్యాంగత్వం ఉన్నవారు ఇంటి వద్ద నుంచి ఓటు వేసేందుకు అర్హులుగా నిర్ధారించారు. ఇంటి వద్దే ఓటు వేసే ప్రక్రియ మొత్తాన్ని వీడియో చిత్రీకరణ చేస్తారు. ఓటు ఎవరికి వేసారో తెలియకుండా గోప్యతను పాటించేలా రహస్య ఓటింగ్ విధానాన్ని అమలు చేస్తారు. అవసరమైతే అభ్యర్థులు ఈ ప్రక్రియను పర్యవేక్షించుకోవచ్చు.

ఓటు నమోదుకు ఆఖరి అవకాశం



ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధం వంటిది. శాసన కర్తలను, నేతలను ఎన్నుకునేందుకు వయోజనులందరికీ రాజ్యాంగం కల్పించిన గొప్ప అవకాశం ఓటు. అర్హత ఉన్నా ఓటు హక్కు లేని వారికి, 18 ఏళ్ళు నిండినవారు కొత్తగా ఓటు వేసేందుకు చాలామంది ఆశక్తి చూపడంలేదు. పల్లెలతో పోలిస్తే పట్టణ ప్రాంతాల్లో ఓటింగ్ శాతం మరింత తక్కువ నమోదవుతుంది. ప్రజాస్వామ్య ప్రక్రియలో కీలకమైన ఓటు హక్కును పొందడంతోపాటు ఎన్నికలలో ఓటు హక్కుపై ప్రజలకు వివరిస్తున్నారు. వినూత్న కార్యక్రమాలతో ఓటు హక్కు ప్రాముఖ్యతపై తెలియజేస్తున్నారు. రానున్న లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలలో ఓటింగ్ శాతాన్ని పెంచేలా అధికారులు, యంత్రాంగం కృషిచేస్తున్నారు. ఇందులో భాగంగా ఓటరు నమోదు, ఓటు హక్కు వినియోగంపై ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

- రేపటితో ముగియనున్న గడువు
- ఓటు హక్కు నమోదు, వినియోగంపై విస్తృత ప్రచారం
- ఓటింగ్ శాతం పెంచేందుకు వినూత్న కార్యక్రమాలు
- పట్టణాలు, నగరాలు, యువతే టార్గెట్
- కాలనీలు, గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు

సామర్లకోట, ఏప్రిల్ 13: కొత్త ఓటర్ల నమోదుకు కేంద్ర ఎన్నికల సంఘం విధించిన గడువు సమీపిస్తోంది. 18 ఏళ్ల నిండిన వారితో పాటూ అర్హత ఉన్నప్పటికీ వివిధ కారణాల వలన ఓటరుగా పేరు నమోదు చేసుకోని వారు ఇక ఆలస్యం ఎంతమాత్రం చేయకుండా తమ పేరు ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలి. ఈ నెల 15వ తేదీలోగా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకుంటేనే ఈ లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలలో ఓటేసే అవకాశం లభిస్తుంది. ఈ మే నెల 13న లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న విషయం విదితమే. అర్హత ఉన్న వారంతా ఓటరుగా పేరు నమోదు చేసుకుని ప్రజాస్వామ్యంలో ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎన్నికల సంఘం విస్తృత ప్రచారం చేస్తోంది. అయితే పట్టణాలు, నగర ప్రాంతాలలో చదువుకున్నవారు అధికంగానే ఉన్నప్పటికీ ఓటరుగా పేరు నమోదు, ఓటుహక్కు వినియోగం విషయంలో ప్రజలు ఆశక్తిచూపడంలేదు. గ్రామీణులతో పోలిస్తే పట్టణాలు, నగరాలలో ఓటింగ్ ప్రక్రియల్లో పాల్గొంటున్న వారి సంఖ్య తక్కువే ఉంటోంది. ఇది ప్రతీ ఎన్నికలలోనూ నిరూపితం అవుతుంది. ఓటు విలువ తెలియక తమ పాలకులను ఎన్నుకునే అవకాశాన్ని కోల్పోతున్నారు. ముఖ్యంగా నగర, పట్టణాలు, తదితర శివారు ప్రాంతాలలో వలస కూలీలు, సంచార జీవులు లక్షలాది మంది ఓటింగ్‌కు దూరంగా ఉంటున్నారు. కొందరు తమకు అర్హత ఉన్నా ఓటరుగా పేరు కూడా నమోదు చేసుకోవడం లేదు. పట్టణ, నగర ప్రాంతాలు అభివృద్ధితో ముందుకు వెళుతున్నా ఎన్నికలలో ఓటు వేసే విషయంలో మాత్రం వెనుకబడే ఉంటున్నారు. ఎన్నికల రోజును చాలా మంది ఓ సెలవు దినంగానే చూస్తున్నారు. గత సార్వత్రిక ఎన్నికలలో కొన్ని పట్టణ ప్రాంతాలు సైతం ఓటింగ్ శాతం 60 శాతానికి మించకపోవడం గమనార్హం. వీటిని దృష్టిలో ఉంచుకుని రానున్న ఎన్నికలలో ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు రెండు నెలల ముందుగానే ఎన్నికల కమీషన్ అధికారులు కార్యాచరణ మొదలెట్టారు. ఓటు హక్కు విని యోగంపై ప్రజలను చైతన్యపరిచేందుకు పలు కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇప్పటికే బూత్‌స్థాయి అధికారులు (బీఎల్వో)తో పాటూ తహశీల్దార్, ఆర్డీవో కార్యాలయాలలో ఓటరు జాబితాను అందుబాటులో ఉంచారు. ప్రజలు ఈ జాబితాలను పరిశీలించి జాబితాలో తమపేరు ఉందో లేదో చూసుకోవాలి. మున్సిపాల్టీలలో మున్సిపల్ కార్యాలయాలలో దరఖాస్తు చేసుకోవాలి. అలాగే ఎన్నికల సంఘం ఓటరు సర్వీస్ పోర్టల్‌తో పాటు ఓటర్ హెల్ప్‌లైన్ యాప్ ద్వారా కూడా ఆన్‌లైన్‌లో ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. ఇందుకు చివరి గడువు మాత్రం ఏప్రిల్ 15 అని మాత్రం అందరూ గుర్తించాలి.

ఓటు హక్కు పొందేందుకు వీరంతా అర్హులే

జిల్లా వ్యాప్తంగా పలు మండలాలలో 18 ఏళ్ల నిండిన వారంతా ఓటరుగా తమ పేరు నమోదు చేసుకునేందుకు అర్హులే. 2006 మార్చి 31లోగా పుట్టిన వారంతా ఓటరు జాబితాలో పేరు నమోదుకు ఫారం-6 ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. దరఖాస్తుకు వయస్సు ధ్రువపత్రంతోపాటు పాస్‌పోర్టు సైజ్ ఫోటో జతపరిచి సంబంధిత బీఎల్వోలకు అందజేయాలి. ఓటర్ల జాబితాలో పేర్లు గల్లంతైనవారు, అన్ని అర్హతలున్నా ఇప్పటివరకూ ఓటరుగా నమోదు చేసుకోని వారంతా ఫారం-6 ద్వారానే దరఖాస్తు చేసుకోవాలి. ఓటరు నమోదుకు వెబ్‌సైట్ ద్వారా కూడా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఓటరు అన్నీ ఓకే అయిన తరువాత కొన్ని రోజులలో ఇళ్ల వద్దకే ఓటరు గుర్తింపు కార్డును పంపిస్తారు. సంబంధిత ప్రాంత బూత్‌లెవెల్ అధికారులు ఓటరు గుర్తింపు కార్డులు పంపిణీ చేస్తారు. ఒకవేళ గుర్తింపు కార్డు రాకున్నా ఆన్‌లైన్ నుంచి డౌన్లోడ్ చేసుకోవచ్చు. ప్రజలు దరఖాస్తులు చేసుకునే సమయంలో దరఖాస్తు రిజెక్ట్ కాకుండా నిర్ణీత ప్రొఫార్మాలో ఆధార పత్రాలతో జతపర్చి దరఖాస్తు చేసుకోవాలి. ముఖ్యంగా జెరాక్స్ పత్రాలను జతచేయాలి. ఇటీవల తీసుకున్న పాస్‌పోర్టు సైజ్ ఫోటోను ప్రొఫార్మాలో అడిగిన ఇతర వివరాలను సమర్పిస్తే దరఖాస్తు రిజెక్ట్ కాకుండా ఓటరుగా నమోదవుతారు.

యువతే లక్ష్యంగా వివిధ అవగాహన కార్యక్రమాలు

లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలలో ఓటింగ్ శాతం పెంచేందుకు అధికారులు అన్ని చర్యలు తీసుకుంటున్నారు. 18 ఏళ్ల నిండిన వారందరికీ ఓటు హక్కు కల్పించడంతో పాటు ఓటు హక్కు వినియోగంపై ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నారు. దేశంలోని ఓటర్లంతా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలనే సంకల్పంతో కేంద్ర ఎన్నికల కమీషన్ స్వీప్(సిస్టమేటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్) కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. రాష్ట్రంలో మే 13న లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా ఉమ్మడి జిల్లాలో స్వీప్ కార్యక్రమ నిర్వహణ కోసం ఒక నోడల్ అధికారిని నియమించారు. ముఖ్యంగా ఓటింగ్ శాతం తక్కువ నమో దయ్యే పట్టణ, నగర, గ్రామీణ ప్రాంతాలలో వినూత్న రీతిలో ఓటర్ల చైతన్యకార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. యువతను చైతన్యపరిచేందుకు కళాశాలల్లో కూడా వినూత్న అవగాహనా కార్యక్రమాలు చేపడుతున్నారు. విద్యార్థులకు ఓటు నమోదుతోపాటూ సద్వినియోగం చేసుకునేలా అవగాహన ఏర్పరుస్తున్నారు. ప్రతీ కళాశాలలో క్యాంపస్ అంబాసిడర్‌లను నియమించారు. వీరు మిగతా విద్యార్థులకు ఓటరుగా నమోదుకావడానికి తోడ్పడుతున్నారు. ఓటు హక్కు వినియోగంపై తల్లిదండ్రులను చైతన్యపరిచే పిల్లలతో కూడా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. నేను ఓటేస్తా, 5కె రన్, 2కె రన్, ప్రతిజ్ఞలు వంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. అధికారులు, ఉద్యోగులు, సీనియర్ సిటిజెన్‌లు, ట్రాన్స్‌జెండర్లు, యువత, దివ్యాంగులు, వాకర్స్ అసోసియేషన్, సైకిలిస్ట్ అసోసియేషన్లు, పోలీసులు, విద్యార్థులను ఈ కార్యక్రమాలలో భాగస్వాములుగా చేస్తున్నారు. రెండు రోజులుగా రాష్ట్ర ఎన్నికల కమీషనర్ ఎంకే మీనా రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో పర్యటిస్తున్నారు. ఐ ఓట్ ఫర్ ష్యూర్ (నేను తప్పకుండా ఓటు వేస్తాను) వంటి నినాదాలతో ప్లకార్డులను ప్రదర్శించారు.

25న అనుబంధ జాబితా

లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన ఓటర్ల తుది జాబితాను గత ఫిబ్రవరి 8న ఎన్నికల అధికారులు ప్రకటించారు. ఎన్నికలకు ఇంకా సమయం ఉండడంతో మరోసారి జాబితా సవరణ చేపట్టారు. దీని ప్రకారం ఈనెల 15 తేదీ వరకూ ఓటరు నమోదు దరఖాస్తుకు అవకాశం కల్పించారు. ఈ దరఖాస్తులను పరిశీలించి అర్హత ఉన్న వారి పేర్లను అనుబంధ జాబితాలో చేరుస్తారు. లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలలో ఓటు వేయాలన్నా, అభ్యర్థులుగా పోటీ చేయాలన్నా ఓటరు జాబితాలో పేరుంటేనే సాధ్యం అవుతుంది. ఓటు హక్కు అర్హత ఉండి జాబితాలో పేరులేని వారందరూ దరఖాస్తు చేసుకోవాలి. అలాగే రాజకీయ పార్టీల నాయకులు, చదువుకున్న వారు ఓటరు జాబితాలో పేరు నమోదు, సవరణలపై తెలియని వారికి తెలియజెప్పాలి. ఓటరు జాబితాలో పేరు చెక్ చేసుకోవాలని, పేరు లేకుంటే దరఖాస్తు కోసం ప్రోత్సహించాలి.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం • తుని ● ప్రత్తిపాడు ● జగ్గంపేట

జనసేనలో చేరిక

సర్పవరం జంక్షన్, ఏప్రిల్ 13: వాకలపూడి జనసేన పార్టీ నాయకులు గేదెల చిన్నారావు, గంటా ప్రసాద్‌ల ఆధ్వర్యంలో వైసీపీ నాయకులు మాగంటి ప్రసన్నకుమార్, కణితి శ్రీనివాస్‌లు 50 మంది అనుచరులతో కలసి శనివారం వలసపాకల జనసేన కార్యాలయంలో జనసేనలో పార్టీలో చేరారు. వారందరికీ రూరల్ జనసేన, టీడీపీ కూటమి అభ్యర్థి పంతం నానాజీ పార్టీ కండువాలు వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.

మద్యం అక్రమ రవాణా అడ్డుకట్టకు నిరంతర నిఘా

సెబ్ జాయింట్ కమిషనర్ నాగలక్ష్మి



సెబ్ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న జాయింట్ కమిషనర్ నాగలక్ష్మి

కాకినాడ క్రైం, ఏప్రిల్ 13: రానున్న సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా మద్యం ఏరులై పారనున్న నేపథ్యంలో మద్యం అక్రమ రవాణా అడ్డుకట్టకు సెబ్, పోలీస్ యంత్రాంగం నిరంతర నిఘాలో ఆయా నియోజకవర్గాల సరిహద్దు ప్రాంతాలు ఉండాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) జాయింట్ కమిషనర్ టి.నాగలక్ష్మి అన్నారు. శనివారం ఆమె సెబ్ అడిషనల్ ఎస్పీ శ్రీలక్ష్మితో కలిసి సెబ్, పోలీస్ అధికారులతో జిల్లా పోలీస్ కార్యాలయ సమావేశ మందిరంలో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాగలక్ష్మి మాట్లాడుతూ పాండిచ్చేరి తదితర సరిహద్దు ప్రాంతాల నుంచి జిల్లాలోకి మద్యం అక్రమ రవాణా జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు, సిబ్బంది ఎన్నికల విధులను పారదర్శకంగా, అంకిత భావంతో నిర్వహించాలని కోరారు. ఆమె తొలుత కాకినాడ, నాగమల్లితోటలోని నార్త్ సెబ్‌స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ రవికుమార్, ఏఈఎస్ శ్రీరంగం దొర, సీఐ ఆర్‌బీ పెద్దిరాజు పాల్గొన్నారు.

'అక్రమ తరలింపులు, రవాణాలపై అప్రమత్తం'

సామర్లకోట, ఏప్రిల్ 13: రైలు ప్రయాణికుల భద్రతతో పాటు రైళ్లల్లో అక్రమ తరలింపులు, అక్రమ రవాణాలపై రైల్వే సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని... ప్రధానంగా నగదు, మంగారం, మద్యం తదితర మత్తు పదార్థాల అక్రమ రవాణాను నిరోధించేందుకు కృషిచేయాలని రైల్వే ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కెవి.గిరి పేర్కొన్నారు. శనివారం సామర్లకోట రైల్వే స్టేషన్ ఆవరణలో స్టేషన్ సూపరింటెండెంట్ ఎం.రమేష్ ఆధ్వర్యంలో భద్రతా చర్యలపై రైల్వే అధికారుల సమన్వయ సమావేశం నిర్వహించారు. ఎన్నికల సమయం కావడంతో రైళ్లల్లో ఆధారాలు లేకుండా నగదు తరలింపులు జరగకుండా అధికారులు నిరంతరం అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. రైల్వే స్టేషన్‌లో ప్రత్యేక నిఘా విషయంలో భద్రతకు అత్యంత ప్రాధాన్యమివ్వాలన్నారు. సామర్లకోట, పిఠాపురం, బిక్కవోలు, అనపర్తి రైల్వే స్టేషన్‌ల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. సమావేశంలో ఆయా రైల్వే స్టేషన్లకు చెందిన అధికారులు ఏ.బసవేశ్వరరావు, ఏవీకె.సంతోష్‌కుమార్, ఏజే.నారాయణరాజు, కె.సంజీవ్‌కుమార్, జీశ్రీదేవి పాల్గొన్నారు.

ఈసీ ఆదేశాలు పాటించాలి : డీఎస్పీ

ప్రత్తిపాడు, ఏప్రిల్ 13: ఎన్నికల కమిషన్ ఆదేశాలు, నిబంధనలు రాజకీయ పార్టీలు తప్పకుండా పాటించాలని పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి చెప్పారు. శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఈసీ నిబంధనలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ లతాకుమారి మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాలను అతిక్రమిస్తే కేసులు నమోదు చేయక తప్పదన్నారు. వాహనాలు, మైకులు, ఫ్లెక్సీలు సమావేశాలకు 48 గంటలు ముందుగానే అనుమతులు పొందాలని తెలిపారు. సమావేశంలో ప్రత్తిపాడు సీఐ ఎం.శేఖర్‌బాబు, ఎస్ఐలు ఎం.పవన్‌కుమార్, సతీష్, కిశోర్ రాజకీయ పార్టీల ప్రతినిధులు శేరుకృష్ణ, బెహరా లక్ష్మిప్రసన్న, సింగిలిదేవ్ సత్తిరాజు, ధర్నాల కోట శ్రీను, కొండపల్లి శ్రీను, మిదినే బాబ్జి, లక్ష్మినారాయణ, ఆచంట రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ ప్రతినిధులతో సమావేశం

తుని రూరల్, ఏప్రిల్ 13: తుని నియోజకవర్గానికి చెందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో పెద్దాపురం డీఎస్పీ కె.లతాకుమారి సమావేశమయ్యారు. రాజకీయ పార్టీలు ఎన్నికల కోడ్‌కు సంబంధించి నిబంధనలు అమలుచేయాలని, ముఖ్యంగా సోషల్ మీడియా ప్రచారంలో నిబంధనలకు లోబడి ఉండాలని లేకపోతే చర్యలు తప్పవన్నారు. ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. రూరల్ సీఐ ఎస్‌వీ.మూర్తి, రూరల్ ఎస్ఐ డి.రమేష్‌బాబు, కోటనందూరు ఎస్ఐ బి.శంకర్, తొండంగి ఎస్ఐ బి.వినయ్ ప్రసాద్ పాల్గొన్నారు.

'కాంగ్రెస్ అభ్యర్థులను మార్చాలి'

కాకినాడ సిటీ, ఏప్రిల్ 13: కాంగ్రెస్ పార్టీలో కష్టపడిన వారికి అసెంబ్లీ టిక్కెట్లు కేటాయించకుండా, పార్టీలు మారి వచ్చిన వారికి టిక్కెట్లు ప్రకటించారని, అసెంబ్లీ టిక్కెట్లలో కొందరు అభ్యర్థులను మార్చకపోతే తాము సహాయ నిరాకరణ చేస్తామని కాకినాడ సిటీ అసెంబ్లీ నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త కోలా ప్రసాదవర్మ, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి తుమ్మలపల్లి వాసు, పార్టీ రాష్ట్ర మత్స్యకార విభాగం ఉపాధ్యక్షుడు లంకే పకీర్‌రాజు అల్టిమేటం జారీ చేశారు. కాకినాడలోని శాంతిభవన్ కాన్ఫరెన్స్ హాల్‌లో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కాకినాడ పార్లమెంట్ పరిధిలో కాకినాడ సిటీ, కాకినాడ రూరల్, ప్రత్తిపాడు, తుని, పిఠాపురం అసెంబ్లీ నియోజకవర్గాలకు ప్రకటించిన అభ్యర్థులను మార్చాలన్నారు.

'బీసీలకు అండగా నిలుస్తాం'

ఉప్పలంక (కరప), ఏప్రిల్ 13: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనతో బాటు ప్రత్యేక రక్షణ చట్టం అమల్లోకి తీసుకువచ్చి బీసీలకు అండగా నిలుస్తామని కాకినాడ రూరల్ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి పంతం నానాజీ పేర్కొన్నారు. కరపమండలం ఉప్పలంక, మొండి గ్రామాల్లో శనివారం ఆయన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాలను వివరించి గాజు గ్లాసు గుర్తుకు ఓటేయాలని అభ్యర్థించారు. టీడీపీ కాకినాడ రూరల్ కో-కోఆర్డినేటర్ కటకంశెట్టి ప్రభాకర్, నులుకుర్తి వెంకటేశ్వరరావు, డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, దేవు వెంకన్న, బోగిరెడ్డి కొండలరావు, గంగాధర్, బండారు మురళి తదితరులు పాల్గొన్నారు.

'బీసీల ద్రోహిగా జగన్'

సర్పవరం జంక్షన్, ఏప్రిల్ 13: బీసీలను అన్ని విధాలుగా మోసం చేసి బీసీల ద్రోహిగా జగన్ ప్రభుత్వం మిగిలిందని మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, టీడీపీ రూరల్ కోఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణమూర్తి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం నేమాంలో జనసేన పార్టీ కూటమి అభ్యర్థి పంతం నానాజీ, ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయ శ్రీనివాస్‌లకు మద్దతుగా ఇంటింట ప్రచారం నిర్వహించి, గాజు గ్లాసు గుర్తుకు ఓట్లేయాలని అభ్యర్థించారు. పార్టీ నాయకులు రాందేవు సీతయ్యదొర, మట్టా ప్రకాశ్‌గౌడ్, బావిశెట్టి శ్రీను, బొజ్జ భవాని, పలివెల గాయత్రి పాల్గొన్నారు.

'సంస్కృతి రక్షణతో సమసమాజ నిర్మాణం'

ఏలేశ్వరం, ఏప్రిల్ 13: దేశ సంస్కృతి, సంప్రదాయాలు రక్షించుకున్నప్పుడే సమసమాజ నిర్మాణం సాధ్యపడుతుందని స్వామి దివ్యానంద అన్నారు. సిరిపురం శ్రీచిద్గగనానంద గీతాశ్రమంలో నిర్వహించిన 50వ రాష్ట్రస్థాయి భక్తి, జ్ఞానవేదాంత మహోసభలు శనివారం ప్రారంభమయ్యాయి. చిత్రాడ ఆశ్రమానికి చెందిన స్వామి విశ్వనాధ, పలు ఆశ్రమాల స్వామీజీలు పాల్గొని జ్యోతి ప్రజ్వలన, గీతా యజ్ఞం, ప్రణవోపాసన, ప్రాతకాల ప్రార్థన, పతాకిరోహణ, సూర్యనమస్కారాలు, గీతా పారియణము పలు ఆధ్యాత్మిక ప్రసంగాలు బోధించారు. కార్యక్రమంలో ఆశ్రమ కమిటీ సభ్యులు పొలమూరి పెద్దకాపు, మజ్జారి వెంకటేశ్వర్లు అనే అబ్బు తదితరులు పాల్గొన్నారు.

'అవినీతికి నిలయంగా మారిన కాకినాడ'

కార్పొరేషన్ (కాకినాడ), ఏప్రిల్ 13: వైసీపీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి పాలనలో కాకినాడ అవినీతికి నిలయంగా మారిందని జైభీమ్ రావ్ భారత్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జగ్గారపు మల్లిఖార్జున అన్నారు. పార్టీ కార్యాలయంలో శనివారం విలేకర్లతో ఆయన మాట్లాడుతూ తమ పార్టీ జిల్లాలో 7 నియోజకవర్గాలు, ఒక పార్లమెంటులో పోటీ చేస్తుందన్నారు. సిటీలో కనీస మౌలిక సదుపాయాలను కల్పించడంలో వైసీపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. జిల్లా కోశాధికారి జి.హరీష్ ఉన్నారు.

లింగంపర్తిలో ఉదయ్‌శ్రీనివాస్ ప్రచారం

ఏలేశ్వరం, ఏప్రిల్ 13: మండలంలోని లింగంపర్తిలో శనివారం కాకినాడ ఎంపీ కూటమి అభ్యర్థి తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి యువతకు ఉద్యోగావకాశాలు, మహిళలకు ఉపాధి అవకాశాలు పవన్‌కల్యాణ్, చంద్రబాబుతోనే సాధ్యమని ప్రజలకు కూటమి మేనిఫెస్టోను వివరించారు. గాజు గ్లాసు గుర్తుపై ఓటు వేసి తనను, ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేస్తున్న వరుపుల సత్యప్రభకు సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. జనసేన, బీజేపీ ఇంచార్జ్ నాయకులు తమ్మయ్యబాబు, గంటా బాబు, ఉమ్మిడి వెంకట్రావు, రెడ్డి లోవరాజు, పలివెల శ్రీనివాస్, గొల్లపల్లి త్రినాద్, గొల్లపూడి సత్యనారాయణ, కూరాకుల రాజా పాల్గొన్నారు.

కోరమండల్ ఎన్నికల్లో నూకరాజు ప్యానల్ విజయం

కార్పొరేషన్ (కాకినాడ), ఏప్రిల్ 13: కాకినాడ కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ కర్మాగారంలో గుర్తింపు పొందిన ఎంప్లాయిస్ యూనియన్‌కు 2024-26 సంవత్సరానికి సంబంధించి ఆఫీస్ బేరర్లకు ఎన్నికలు నిర్వహించారు. ఎల్.నూకరాజు ప్యానల్ ఇతర ప్యానల్‌పై అత్యధిక మెజార్టీతో విజయం సాధించారు. ప్రెసిడెంట్‌గా ఎల్.నూకరాజు, వైస్ ప్రెసిడెంట్ డి.దాసు, జనరల్ సెక్రటరీ ఎ.నాగేశ్వరరావు, సెక్రటరీ ఎండి బషీర్ బాషా, కోశాధికారి కె.మదన్, ప్రచార కార్యదర్శి ఎస్.గౌతమ్‌లెనిన్ ఎన్నికయ్యారు.

పోలింగ్ నిర్వహణపై అవగాహన ఉండాలి

» కలెక్టర్ నివాస్
» పీవో, ఏపీవోలకు శిక్షణా తరగతులు

ప్రత్తిపాడు, ఏప్రిల్ 13: పోలింగ్ నిర్వహణపై ఎన్నికల సిబ్బందికి సమగ్ర అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ జె.నివాస్ స్పష్టంచేశారు. ప్రత్తిపాడులోని రెడ్డెం రామ్మూర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎన్నికల్లో పాల్గొనే పీవో, ఏపీవోలకు 2రోజులు పాటు నిర్వహించిన శిక్షణా తరగతులు శనివారం ముగిశాయి. ఈ శిక్షణా శిబిరాన్ని సందర్శించిన కలెక్టర్ నివాస్ మాట్లాడుతూ ఎన్నికల సిబ్బందికి పోలింగ్ నిర్వహణలో ఎదురయ్యే సందేహాలు నివృత్తి కోసం పీవోల దగ్గర ఉండే హ్యాండ్ బుక్‌లను చదివి అవగాహన చేసుకోవాలన్నారు. పీవోలు, ఏపీవోలు ఎన్నికల్లో నిర్వహించాల్సిన విధి విధానాలను కలెక్టర్ ఆరా తీసి పరిశీలించారు. పోలింగ్‌రోజున ఎలక్షన్ కమిషన్‌కు పంపే నివేదికలపై సిబ్బందికి వివరించారు. ఛాలెంజింగ్ ఓటు, టెస్ట్ ఓటు, జనరల్ ఓటు, 17సీకు సంబంధించి ఎంతమంది ఓటర్లు పాల్గొన్నారనే అంశాలపై కూడా సిబ్బందికి సమగ్రంగా వివరించారు. ప్రత్తిపాడు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ.శ్రీనివాసరావు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఏప్రిల్ 15 వరకు గడువు ఉందని ఆఫ్‌లైన్ ద్వారా బూత్‌స్థాయి అధికారులకు నేరుగా ఫారం6 దరఖాస్తులు అందజేయవచ్చని, ఆన్‌లైన్‌లో ఓటుకు దరఖాస్తు చేసుకునేందుకు వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేయాలని వివరించారు. సమావేశంలో ఏఆర్‌వో ఎం.నరసింహారావు, విద్యాపతి, ఏలేశ్వరం నగర పంచాయతీ కమిషర్ శివప్రసాద్, ఎలక్షన్ డీటీ శ్రీనివాసరావు, ఆనందరావులతో పాటు నియోజకవర్గ ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.



తునిలో ఎలక్షన్ సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్

శిక్షణా తరగతుల పరిశీలన

తునిరూరల్, ఏప్రిల్ 13: తునిలో పోలింగ్ సిబ్బందికి జరుగుతున్న శిక్షణా తరగతులను శనివారం కలెక్టర్ జె.నివాస్ పరిశీలించారు. అనంతరం తుని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను పరిశీలించి పోలింగ్ సిబ్బందితోపాటుగా డీఆర్వోకు పలు సూచనలు ఇచ్చారు. ఎన్నికల ప్రక్రియల పట్ల పీవోలు, ఇతర సిబ్బంది సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలన్నారు. పోలింగ్ ప్రక్రియ ప్రారంభం ముందు నిర్వహించే మాక్పోల్ అత్యంత కీలకమని పోలింగ్ సిబ్బందికి వివరించారు. ఈవీఎం, వీవీప్యాడ్ పనితీరు, పీవోడైరీ, ఇతర డాక్యుమెంట్స్ పూర్తి చేయడంలో ఎటువంటి తప్పులకు తావులేకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని కలెక్టర్ తెలిపారు. ఆయన వెంట తుని రిటర్నింగ్ అధికారి కేవీ రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'ఎన్నికల్లో పీవోలదే కీలకపాత్ర'

సర్పవరంజంక్షన్, ఏప్రిల్ 13: ఎన్నికల విధులపై పూర్తి అవగాహన చేసుకుని అప్రమత్తంగా విధులు నిర్వహించాలని, ఎన్నికల ప్రక్రియలో ప్రిసైడింగ్ అధికారులు (పీవో)ల పాత్ర ఎంతో కీలకమని కాకినాడ రూరల్ నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఇట్ల కిషోర్ అన్నారు. కాకినాడ విద్యుత్తునగర్ ఐడియల్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం రెండోరోజు పీవోలు, ఏపీవోలకు నిర్వహిస్తోన్న శిక్షణా కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. నియోజకవర్గంలో 751 మంది పీవోలు, ఏపీవోలు ఉన్నారన్నారు. వీరందరూ ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు సక్రమ నిర్వహణ కోసం ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. రెండో విడతలో ఎన్నికలు విధులు నిర్వహించే సిబ్బందికి శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ బి.విజయప్రసాద్, డిప్యూటీ తహశీల్దార్ సురేష్ తదితర అధికారులు పాల్గొన్నారు.



సర్పవరంజంక్షన్: సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఇట్ల కిషోర్

కూటమి ప్రభుత్వ ఏర్పాటుకు కృషి చేయాలి

పలుచోట్ల కూటమి అభ్యర్థుల ప్రచారం





కాకినాడలో మాట్లాడుతున్న కొండబాబు, ప్రత్తిపాడు: టీడీపీలోకి ఆహ్వానిస్తున్న సత్యప్రభ

కాకినాడ సిటీ, ఏప్రిల్ 13: దళిత జాతిని అగణదొక్కిన వైసీపీ ప్రభుత్వాన్ని రాష్ట్రం నుంచి తరిమికొట్టాలని, దళితులను అభివృద్ధి పథంలో నడిపించే టీడీపీ కూటమి ప్రభుత్వ ఏర్పాటుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కాకినాడ సిటీ అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి వనమాడి కొండబాబు కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఏడో డివిజన్ రేచెర్లపేటలో దళిత గర్జన సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ దళిత ఓట్లతో గద్దెనెక్కిన జగన్‌రెడ్డి, వైసీపీ నేతలు దళితులపై దాడులు చేసి అణగదొక్కడమే కాకుండా దళిత దళితులకు మంచి రోజులు రావడం కోసం 'దళితుల పంతం.. వైసీపీ అంతం'.. నినాదంతో ద్వారంపూడిని గద్దె దించేందుకు ప్రతి ఒక్కరూ కంకణం కట్టుకుని సిద్ధంగా ఉన్నారన్నారు. టీడీపీ దళిత నాయకులు అంబటి చిన్న, సీకోటి అప్పలకొండ, కొల్లాబత్తుల అప్పారావు, పలివెల రవిఅనంతకుమార్, బంగారు సత్యనారాయణ, పోలిపల్లి జగన్, బీజేపీ నాయకుడు ఏడిద కృష్ణ, జనసేన నాయకులు మట్టా లక్ష్మణ్, దోకుబర్ర రాజు, బొచ్చా దాసు, దౌర్ల చిట్టిబాబు, పెదపూడి కుమార్, బుంగా నాగరాజు ఉన్నారు.

'వైసీపీకి రోజులు దగ్గర పడ్డాయి'

ప్రత్తిపాడు, ఏప్రిల్ 13: రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలనకు రోజులు దగ్గర పడ్డాయని, టీడీపీలో చేరిన కార్యకర్తలు, నాయకులు వైసీపీని తరిమికొట్టాలని ప్రత్తిపాడు టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి వరుపుల సత్యప్రభ రాజా పిలుపునిచ్చారు. మండలంలోని రాచపల్లిలో అన్నవరం దేవస్థానం మాజీ పాలకమండలి సభ్యుడు బుద్దరాజు గోపీరాజు ఆధ్వర్యంలో 100 వైసీపీ కుటుంబాలు ఆ పార్టీని వీడి సత్యప్రభ సమక్షంలో శనివారం టీడీపీలో చేరారు. చేరినవారిలో సారెపల్లి నానిబాబు, మడగలవీరబాబు, మడగల వెంకటరమణ ఉన్నారు. టీడీపీ నాయకులు గొల్లపల్లి నరసింహమూర్తి, పి.సురేష్, సర్పంచ్‌లు రొంగల సత్యనారాయణ, అమరాది వెంకట్రావు, మాజీ సర్పంచ్ జామి మాణిక్యం, దంతులూరి సత్యనారాయణ, కృష్ణంరాజు, వీరబాబు, చక్రి, బత్తుల భాస్కర్ పాల్గొన్నారు. ప్రత్తిపాడు టీడీపీ కార్యాలయం వద్ద ఏలేశ్వరం మండలం యర్రవరంకు చెందిన 50 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. యర్రవరం టీడీపీ నాయకులు బస్వా ప్రసాద్, షైరాల కనకారావు ఆధ్వర్యంలో గ్రామ మాజీ ఉపసర్పంచ్ సొసైటీ డైరెక్టర్ దాసరి రమేష్, రాయి మణికంఠ, దాసరి బాబురావు, చల్లపల్లి దుర్గ, ఉలిమికృష్ణార్జున, రాయి లోవబాబు, నక్కా అంజి, కె.మహాలక్ష్మి, గణేశులకు సత్యప్రభ పార్టీ కండువాలు వేశారు. టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలున్నారు.

'ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలి'

తాళ్లరేవు, ఏప్రిల్ 13: జగనాసురిడి పాలనకు ప్రజలు స్వస్తిపలికి ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలని ముమ్మిడివరం ఉమ్మడి అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు అన్నారు. శనివారం తాళ్లరేవు పంచాయతీ మెయిన్ రోడ్డు, సత్రపుపేట, నందిరేవు, పరదేశమ్మపేట, పెంకేవారిపేట గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించి సైకిల్ గుర్తుకు ఓటువేయాలని అభ్యర్థించారు. తాళ్లరేవు గ్రామాన్ని అన్నివిధాల అభివృద్ధి చేసి ప్రజలకు అంకితం చేస్తానని హామీ ఇచారు. టీడీపీ నేతలు నడింపల్లి వినోద్, కుడిపూడి దుర్గాప్రసాద్, వాకపల్లి చిట్టిబాబు, గంజా సూరిబాబు, గంటా రమేష్, వాసంశెట్టి శ్రీనివాస్, వాతాడి శ్రీను పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారం ప్రారంభం

జగ్గంపేట, ఏప్రిల్ 13: నియోజకవర్గంలో బీసీ నేతలతో జయహో బీసీ ఎన్నికల ప్రచారం ప్రారంభించిన బీసీ నేతలు, ప్రత్యేక వాహనాల్లో బయలుదేరగా జగ్గంపేట రూరల్ బ్యాంక్ మాజీ చైర్మన్ జ్యోతుల మణి జెండా ఊపి ప్రారంభించారు. బీసీ సెల్ అధ్యక్షుడు తాళ్ళూరు సర్పంచ్ శిలామంతుల వీరబాబు ఆధ్వర్యంలో జయహో బీసీ కార్యక్రమం ప్రారంభించారు. కార్యక్రమంలో బుర్ల అప్పలరాజు, బోర సత్తిబాబు, తంగిళ్ళ అప్పారావు, పల్లెల సురేష్, జల్తారుపు శ్రీనివాస్, గంగం పాలెం సత్తిబాబు ఉన్నారు.

గండేపల్లి: మండలంలోని పి.నాయకంపల్లిలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి జ్యోతుల నెహ్రూ కుమార్తె తోట సునీత ఇంటింటా టీడీపీ ప్రచారం నిర్వహించారు. సైకిల్‌పై గుర్తుపై ఓటేసి నెహ్రూను అఖండ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. కార్యకమం లో తోట సర్వారాయుడు, దొడ్డిపట్ల బుజ్జి, జ్యోతుల సత్యమూర్తి, మండపాక శ్రీబాబు, యల్లమిల్లి సీఎం, పిండి బుజ్జి ఉన్నారు.





తాళ్లరేవులో ప్రచారం నిర్వహిస్తున్న దాట్ల, జగ్గంపేట: వాహనాలను ప్రారంభిస్తున్న జ్యోతుల మణి

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు సహకరించాలి

సర్పవరం జంక్షన్, ఏప్రిల్ 13: రాబోయే సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని సర్పవరం పోలీస్‌స్టేషన్ సీఐ వైఆర్‌కే.శ్రీనివాస్ కోరారు. శనివారం సర్పవరం పోలీస్‌స్టేషన్‌లో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకునేలా అవగాహన, భద్రత చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. ఎక్కడా శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా, రాజకీయ గొడవలు, తగాదాలు జోలికి వెళ్లకుండా ఎన్నికల ప్రచారం చేసుకోవాలని కోరారు. సమావేశంలో టీడీపీ, జనసేన, బీజేపీ, వైసీపీ తదితర పార్టీలకు చెందిన నాయకులున్నారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి

కరప, ఏప్రిల్ 13: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని కాకినాడరూరల్ సీఐ కె.శ్రీనివాస్ సూచించారు. మండలంలోని వేళంగి, యండమూరు, ఉప్పలంక గ్రామాల్లో శనివారం ఆయన కేంద్ర సాయుధ బలగాలు, కరప పోలీసులతో కలిసి కవాతు నిర్వహించారు. అనంతరం ఆయా గ్రామాల ప్రజలతో మాట్లాడుతూ రాబోయే ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా సహకరించాలన్నారు. కరప ఎస్ఐ టి.రామకృష్ణఏఎస్ఐ వి.సూరిబాబు ఉన్నారు.

రేషన్ బియ్యం కాదు బాయిల్డ్ రైస్!

కాకినాడ రూరల్, ఏప్రిల్ 13: రూరల్ మండలం తూరంగి ప్రధాన రహదారిలో శుక్రవారం అర్ధరాత్రి రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నారని ఇంద్రపాలెం పోలీసులకు సమాచారం రావడంతో తనిఖీలు నిర్వహించి 2 లారీలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. శనివారం ఉదయం సంబంధిత డీఎస్‌వో, ఎంఎస్‌వో పూర్తిస్థాయిలో పరిశీలించారు. ఆ బియ్యం రేషన్ బియ్యం కాదని బాయిల్డ్ రైస్ అని నిర్ధారించి అది తమ పరిధిలోనికి రాదని అక్కడి నుంచి వెళ్లిపోయారు. అయితే ఉప్పలంక రైస్‌మిల్లుకు సంబంధించిన ఓ గొడౌన్ నుంచి 2 లారీల్లో ఒక్కోదానిలో 50 కిలోల బరువు గల 250బస్తాలు అనగా మొత్తం 500 బస్తాల బియ్యాన్ని కాకినాడ పోర్టుకు తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. దీనిపై ఎస్ఐ మణికుమార్‌ను వివరణ కోరగా రూరల్ మండలం ఎంఎస్‌వో మమత నుంచి అవి రేషన్ బియ్యం కాదని, బాయిల్డ్ రైస్ అని నిర్ధారించిన లెటర్‌ను తీసుకుని ఆ బియ్యం లారీలను వదిలివేసామని ఏవిధమైన కేసు నమోదు చేయలేదని తెలిపారు.

'పవన్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి'



గొల్లప్రోలు: జనసేన నాయకులు, అభిమానులతో సమావేశమైన స్వామినాయుడు

గొల్లప్రోలు, ఏప్రిల్ 13: పిఠాపురం నుంచి పోటీ చేస్తున్న జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌ను భారీ మెజార్టీతో గెలిపించే బాధ్యతను తీసుకోవాలని అఖిలభారత చిరంజీవి అభిమాన సంఘాల అధ్యక్షుడు రవణం స్వామినాయుడు కోరారు. గొల్లప్రోలు పట్టణంతో పాటు దుర్గాడ తదితర గ్రామాల్లో ఆయన శనివారం విస్తృతంగా పర్యటించారు. పవన్‌ను ఓడించేందుకు అధికార వైసీపీ చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. అభిమానులంతా కలిసి పనిచేయాలని సూచించారు. గొల్లప్రోలులో జరిగిన సమావేశంలో నియోజకవర్గ ఎన్నికల కమిటీ సభ్యుడు కడారి తమ్మయ్యనాయుడు పాల్గొనగా, దుర్గాడలో జరిగిన సమావేశంలో జనసేన పార్టీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి జ్యోతుల శ్రీనివాస్, చిరంజీవి అభిమాన సంఘాలు, జనసేన నేతలు ఉలవల తాతాజీ, ఏడిది శ్రీను, రవీంద్రబాబు, భైరు వెంకన్నగౌడ్, రమేష్‌నాయుడు, ఏడిద బాబి, సత్యనారాయణ, ఉమ్మిడి సత్తిబాబు, తెలగంశెట్టి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కొత్తపల్లి: పిఠాపురం నియోజకవర్గం సర్వతోముఖ అభివృద్ధి కోసం పవన్ కల్యాణ్‌ని భారీ మెజారిటీతో గెలిపించాలని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి తుమ్మలపల్లి పద్మజ కోరారు. కూటమి నాయకులతో కలసి శనివారం కొత్తపల్లి మండలం కుతుకుడుమిల్లిలో ఇంటింట ప్రచారం నిర్వహించి రాబోయే ఎన్నికల్లో గాజుగ్లాసు గుర్తుపై ఓట్లేసి ఎమ్మెల్యేగా పవన్, ఎంపీగా ఉదయ్ శ్రీనివాస్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు తెలగంశెట్టి వెంకటేశ్వరరావు, మత్సా అప్పాజీ, మురాలిశెట్టి సునీల్, సానా నాగు, మారిశెట్టి సత్తిబాబు, గంధం నాగేంద్ర, పినపోతుల వీరబాబు, చినబాబు ఉన్నారు.

గాజుగ్లాసు గుర్తుపై ఓట్లువేయాలి

పిఠాపురం, ఏప్రిల్ 13: సాగునీరందక పంటలు ఎండిపోతున్న సమయంలో వైసీపీ నాయకులు ఎక్కడున్నారని, రైతుల కష్టాలు పట్టించుకోకుండా వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత అప్పుడు ఎక్కడకు వెళ్లారని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ ప్రశ్నించారు. పట్టణంలో 27,28,29వ వార్డులు, మండలంలోని విరవాడ గ్రామంలో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రెండు ఓట్లును గాజుగ్లాసు గుర్తుపై వేయాలని, పవన్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. కాగా ఎల్ఎన్‌పురం గ్రామంలో వర్మ సతీమణి లక్ష్మీదేవి ప్రచారం నిర్వహించారు.

శరవేగంతో అభివృద్ధి చెందుతోన్న ఫార్మా రంగం

జేఎన్టీయూకే వీసీ ప్రసాదరాజు

జేఎన్టీయూకే, ఏప్రిల్ 13: ప్రస్తుత తరుణంలో దేశంలో ఫార్మారంగం శరవేగంతో అభివృద్ధి చెందుతోందని జేఎన్టీయూకే ఉపకులపతి ప్రొఫెసర్ జీవీఆర్ ప్రసాదరాజు తెలిపారు. వర్సిటీలోని సెనేట్ హాల్లో స్కూల్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ టెక్నాలజీస్(ఎస్సీ, ఎస్టీ) విభాగం ఆధ్వర్యంలో ఏపీ ఫార్మసీ కౌన్సిల్ సహకారంతో నిరంతర విద్యా కార్యక్రమం అనే అంశంపై రేపటి ఫార్మసీ నేటి 21వ శతాబ్దపు నైపుణ్యాల నిర్మాణం అనే నినాదంతో ఫార్మసీ కౌన్సిల్ రిజిస్టర్డ్ అధ్యాపకులకు రిఫ్రెషర్ కోర్సును నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా వీసీ, ప్రత్యేక అతిథిగా ఏపీ ఫార్మసీ కౌన్సిల్ రిజిస్ట్రార్ డాక్టర్ ఎం.విలియం కేరీ, గౌరవ అతిథులుగా రెక్టార్ కేవీ రమణ, ఫార్మసీ కోర్సుల ప్రత్యేక అధికారి జీవీఎస్ఆర్ దీక్షితులు పాల్గొనగా విభాగాధిపతి డాక్టర్ బి.భవానీ అధ్యక్షత వహించారు. వీసీ మాట్లాడుతూ ప్రపంచ ఔషధశాలగా భారతదేశం పేరు పొందుతోందన్నారు. అనంతరం విలియం కేరీ మాట్లాడుతూ నేడు నేర్చుకుని రేపటి తరానికి అన్వయించుకోవాలన్నారు. రిజిస్టర్డు ఫార్మసీ అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

బాలాత్రిపురసుందరికి విశేష పూజలు

సామర్లకోట, ఏప్రిల్ 13: వసంత నవరాత్ర మహోత్సవం ఐదోరోజులో భాగంగా సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో బాలాత్రిపురసుందరి అమ్మవారికి శనివారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో జరిగిన ఈ పూజల్లో ఆలయ పండితులు సోమేశ్వరశర్మ, చెరుకూరి రాంబాబు తదితరులచే అమ్మవారికి త్రిశతి ఖడ్గమాలా, లలితా అష్టోత్తర సహస్రనామాలు, కుంకుమార్చనలు, నీరాజన మంత్రపుష్పములు, మంత్రపుష్పములు నిర్వహించారు. అమ్మవారిని నూతన పట్టు వస్త్రాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. జిల్లా నలుమూలల నుంచీ అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శిం చుకున్నారు. కంచి మహాసంస్థానం స్వయంవరపార్వతి అమ్మవారి మందిరంలో వసంతనవరాత్ర మహోత్సవాల్లో భాగంగా అమ్మవారికి శ్రీశత చండీయాగ మహోత్సవ పూజలు నిర్వహించారు. కంచి మహాసంస్థానం వ్యవస్థాపకులు చంద్రాభట్ల చింతామణి గణపతిశాస్త్రి సోదరుడు చంద్రాభట్ల పతంజలి, పద్మ దంపతులు ఆసీనులై పూజలు నిర్వహించారు. వివిధ పుష్పాలతో అమ్మవారిని సుందరంగా అలంకరించారు.

గంగాలమ్మ గావు సంబరం

ప్రత్తిపాడు, ఏప్రిల్ 13: మండలంలోని రాచపల్లిలో గంగాలమ్మ గావు సంబరం శనివారం వైభవంగా నిర్వహించారు. గ్రామంలోని చిన్న సారెపల్లి కుటుంబీకుల ఇలవేల్పు అయిన అమ్మవారికి 3ఏళ్ల తరువాత సంప్రదాయబద్ధంగా ఉత్సవాన్ని నిర్వహించారు. సర్పంచ్ సారెపల్లి లోవలక్ష్మిగంగరాజు, సారెపల్లి సూరిబాబు, మల్లికాసులు, పెదనాగరాజు, అప్పలరాజు, కృష్ణ, రాంబాబుల కమిటీతో పాటు సారెపల్లి కుటుంబం ఆధ్వర్యంలో ఈ వేడుకలు నిర్వహించారు. ప్రత్తిపాడు టీడీపీ కూటమి అభ్యర్థి వరుపుల సత్యప్రభ రాజా, అన్నవరం దేవస్థానం మాజీ పాలక మండలి సభ్యుడు బుద్దరాజు గోపిరాజు, టీడీపీ నాయకుడు యాళ్ళ జగదీష్, ఏలేశ్వరం ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, గొంతిన సురేష్, సారెపల్లి లోకేష్ ప్రత్యేక పూజలు చేశారు. తప్పిడిగుళ్ళు, తదితర సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. 20వేల మంది భక్తులు సంబరానికి తరలిరావడంతో వారికి నిర్వాహక కమిటీ అన్నదానం చేశారు.

శ్రీరామనవమికి పందిరిరాట

సర్పవరం జంక్షన్, ఏప్రిల్ 13: శ్రీరామనవమి పురస్కరించుకుని శనివారం కాకినాడ రూరల్ రమణయ్యపేట కాపుల రామాలయం వద్ద ముహూర్తపు పందిరిరాట భక్తుల ఆధ్వర్యాన ఉత్సవ నిర్వాహకులు ఐరెడ్డి సత్యనారాయణ, బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ రంబాల వెంకటేశ్వరరావు వేశారు. వారు మాట్లాడుతూ ఈనెల 17న జరిగే శ్రీరామ నవమి ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. ఆరోజున భారీ అన్నదానం ఉంటుందన్నారు. కార్యక్రమంలో నిమ్మకాలయ వెంకటేశ్వరరావు, పాలూరి సుబ్బారావు, ఐరెడ్డి లక్ష్మి, భరణి, రామలక్ష్మి, పెంటా రాంబాబు తదితరులున్నారు.

విగ్రహ ప్రతిష్ఠ పూజలు

సామర్లకోట, ఏప్రిల్ 13: సామర్లకోట జగ్గమ్మగారిపేటలో ఇటీవల ఆధునీకరించిన కల్యాణ కోదండ రామస్వామి ఆలయంలో నూతన విగ్రహ ప్రతిష్ఠ పురస్కరించుకుని శాంతికర పూజల్లో భాగంగా శనివారం వేదపండితులచే శాస్త్రోక్తంగా ప్రతిష్ఠ పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయంలో కోదండ రామచంద్రయుత విగ్రమ ప్రతిష్ఠ, శ్రీహనుమాన్ లక్ష్మణ సీతా సమేత కల్యాణ పూజలు నిర్వహించారు, శాంతికరపూజల అనంతరం సోమవారం నూతన విగ్రహాల ప్రతిష్ఠా నిర్వహిస్తామని ఆలయ నిర్మాణ కమిటీ ప్రతినిధులు చెప్పారు.

రామాయణ ప్రవచనాలు

ఏలేశ్వరం, ఏప్రిల్ 13: ఏలేశ్వరం శ్రీరూపులమ్మతల్లి ఆలయ ప్రాంగణంలో రామాయణ ప్రవచనాలు నిర్వహించారు. శనివారం విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో తణుకు ప్రవచనకర్త అణివెల్ల రాము విచ్చేసి హనుమాన్ చాలీసా, రామాయణంలోని సుందరాకాండ, సామూహిక పారాయణం తదితర ప్రవచనాలు వివరించారు. అలమండ దుర్గా ప్రసాద్, కటకం కిరీటి, పాపోలుదేవి, మల్లేశ్వరి తదితరులు ఉన్నారు.

వేంకటేశ్వరస్వామికి పూజలు

గండేపల్లి, ఏప్రిల్ 13: మల్లేపల్లి నీలికుండీలపేటలోని రామాలయం వద్ద శనివారం లలితా పారాయణం భజన బృందం వేంకటేశ్వరస్వామి గానామృతం పాటలు పాడుతూ జీవిత చరిత్ర వివరించారు. అలాగే ప్రత్యేక పూజలు చేశారు.

నేషనల్ అథ్లెటిక్స్‌లో పతకాలు



పతకాలు సాధించిన నాగబాబు

కాకినాడ అర్బన్, ఏప్రిల్ 13: సికింద్రాబాద్ రైల్వే స్పోర్ట్స్ స్టేడియంలో శనివారం జరిగిన ఐదో నేషనల్ అథ్లెటిక్స్ ఓపెన్ చాంపియన్‌షిప్‌లో కాకినాడ వైద్యఆరోగ్యశాఖ ఉద్యోగి యాతం నాగబాబు బంగారు, వెండి పతకాలు సాధించారు. 800 మీటర్ల విభాగంలో బంగారు పతకం, 400, 200 మీటర్ల పరుగు పందెం పోటీల్లో రజత పతకాలు గెలుచుకున్నారు.

'ఆదిత్య'లో శిక్షణా కార్యక్రమం

గండేపల్లి, ఏప్రిల్ 13: సూరంపాలెంలోని ఆదిత్య కళాశాలలో తృతీయ సంవత్సరం ఈసీఈ విభాగం నందు మాట్ ల్యాబ్ పరిచయం అనే కోర్సుకు బూట్ క్యాంప్ శిక్షణా కార్యక్రమం విజయవంతంగా నిర్వహించినట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. రియల్‌టైం ఇండస్ట్రియల్ ఎంబెడెడ్ సిస్టమ్ ఎక్స్పర్ట్ అయిన చంద్రశేఖర్ నామాల, అనిల్‌కుమార్ పొన్నగంటి శిక్షణివ్వగా కోఆర్డినేటర్‌గా అసిస్టెంట్ ప్రొఫెసర్ టి.రవీంద్ర వ్యవహరించారు. అలాగే ఆదిత్య యూనివర్సిటీ గ్రంథాలయ విభాగంలో స్పందన ఈదా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక సదస్సు నిర్వహించారు. ఇంటర్నేషనల్ ఫౌండేషన్ కాకినాడ జిల్లా శాఖ ప్రతినిధి తోటకూర గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.